నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 21-3-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 190 పేజీలు: 4 వెల: రూ.1/-

పట్టభద్రుల ఎమ్మెల్సీగా వాణీదేవి విజయం

హైదరాబాద్, మార్చి 20: మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీఆర్ఎస్ అభ్యర్థి ఎస్.వాణీదేవి ఘన విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి రాంచందర్‌రావుపై వాణీదేవి గెలుపొందారు. వాణీదేవికి మొదటి ప్రాధాన్యత ఓట్లు 1,12,689 పోలవ్వగా రెండో ప్రాధాన్యతగా 36,580 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 1,49,269 ఓట్లతో వాణీదేవి విజయధంకా మోగించారు. బీజేపీ అభ్యర్థి రామచందర్‌రావుకి 1,19,198 ఓట్లు వచ్చాయి. రామచందర్‌రావు ఓటమితో బీజేపీ సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది.

దేశంలో ఆగని కరోనా విజృంభణ

రెండోదశలో పెరుగుతున్న కేసుల సంఖ్య
కొత్తగా 40,953 మందికి కరోనా నిర్ధారణ

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): దేశంలో రోజురోజుకూ కరోనా మహమ్మారి తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. భారత్ లో కరోనా మళ్లీ విజృంభిస్తుండడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రెండో దశలో కొత్త కేసులు పైపైకి ఎగబాగుతున్నాయి.

గడిచిన ఒక్కరోజులో భారత్‌లో కొత్తగా 40,953 మంది కరోనా బారినపడినట్టు కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. దీంతో భారత్ లో నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 1,15,55,284కు చేరిందని వారు చెప్పారు. కొత్తగా 23,653 మంది కరోనా నుంచి కోలుకున్నారని, దీంతో ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య 1,11,07,332కు చేరిందని అధికారులు వెల్లడించారు. గడిచిన ఒక్కరోజులో కరోనాతో 188 మంది చనిపోయారని, దీంతో మొత్తం మరణాల సంఖ్య 1,59,558కు పెరిగిందని వారు చెప్పారు. ప్రస్తుతం భారత్ లో 2,88,394 యాక్టివ్ కేసులున్నాయని అధికారులు వెల్లడించారు. గడిచిన 24 గంటల్లో 10,60,971 మందికి కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 40,953 పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. సుమారు నాలుగు నెలల తరవాత ఈ స్థాయిలో రోజువారీ కేసులు బయటపడ్డాయి. దాంతో మొత్తం కేసుల సంఖ్య 1.15 కోట్లకు పైబడింది. మరణాలు సంఖ్యలో కూడా పెరుగుదల కనిపిస్తోంది. తాజాగా 188 మంది మృత్యు ఒడికి చేరగా..శుక్రవారం వరకు 1,59,558 మంది ప్రాణాలు వదిలారు. ఇక, క్రియాశీల కేసులు 2,88,394కి పెరిగాయి. ఒక్కరోజే 23,653 మంది వైరస్ నుంచి కోలుకున్నారు. మొత్తంగా వైరస్‌ను జయించిన వారి సంఖ్య 1,11,07,332కి చేరగా..రికవరీ రేటు 96.26 శాతంగా ఉంది. శనివారం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ గణాంకాలను వెల్లడించింది. ఇకపోతే భారత్‌లో ఇప్పటి వరకు 4,20,63,392 మందికి కరోనా టీకాలు వేసినట్టు అధికారులు స్పష్టం చేశారు. స్వీయనియంత్రణతోనే కరోనా కట్టడి సాధ్యమని వారు తేల్చిచెప్పారు. అత్యవసర పనులు ఉంటేనే రోడ్ల మీదకు రావాలని, రోడ్ల మీదకు వచ్చినప్పుడు విధిగా ఆరు గజాల సామాజిక దూరం పాటించడంతో పాటు మాస్కులు దరించాలని అధికారులు ప్రజలను కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విధించిన కరోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని వారు ప్రజలను హెచ్చరించారు. మహారాష్ట్రలో కరోనా ఉగ్రరూపం చూపిస్తోంది. మొదటిదశ కంటే రెండో దశలో వైరస్ ఉధృతి తీవ్రంగా ఉంది. మహారాష్ట్రలో శుక్రవారం రికార్డు స్థాయిలో 25,681 కొత్త కేసులు నమోద య్యాయి. వాటిలో మూడు వేలకు పైగా కేసులు ముంబయిలోని బయటపడ్డాయి. 2020 అక్టోబర్ 7న అత్యధికంగా 2,848 కొత్త కేసులు వెలుగుచూడగా..రెండో దశలో ఆ సంఖ్య మరింత ఎక్కువగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మార్చి 14 నుంచి ఆరు రోజుల వ్యవధిలో ఒక్క ఆర్థిక రాజధానిలోనే 13,912 మందికి వైరస్ పాజిటివ్‌గా తేలింది. దాంతో మహమ్మారి తీవ్రతను కట్టడి చేసే క్రమంలో కంటైన్‌మెంట్ జోన్లు, సీల్ చేసిన భవనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. మార్చి 18 నాటికి 34 కంటైన్‌మెంట్ జోన్లు ఉండగా, 305 భవనాలను బీఎంసీ సీల్ చేసింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన కరోనా టీకా కార్యక్రమం సజావుగా సాగుతోంది. ఈ క్రమంలో మార్చి ఒకటిన రెండో దశను కూడా ప్రారంభించింది.

వరుసగా 3నెలలు రేషన్ తీసుకోకుంటే కార్డు కట్

అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): మూడు నెలలు వరుసగా రేషన్ బియ్యం తీసుకోకపోతే ఆటోమేటిక్‌గా రేషన్ కార్డు రద్దు అవుతుందని మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా బీపీఎల్ కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డుల జారీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి గంగుల కమలాకర్ సమాధానం ఇచ్చారు. కరోనా కారణంగానే కొత్త కార్డులను జారీ చేయలేకపోయామని మంత్రి స్పష్టం చేశారు. పెండింగ్ దరఖాస్తులను త్వరలోనే వెర్గి÷ చేసి ప్రతి ఒక్క అర్హుడికి తెల్ల రేషన్ కార్డులను జారీ చేస్తామన్నారు. తెల్ల రేషన్ కార్డుల కోసం 9,41,641 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 3,59,974 మందికి ఆహార భద్రతా కార్డులు జారీ చేశామన్నారు. 92 వేల దరఖాస్తులను తిరస్కరించామని, 4,88,775 కార్డుల దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. ఆహార భద్రతా కార్డుల జారీ నిరంతర పక్రియ అని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. గత మూడు సంవత్సరాల్లో హైదరాబాద్‌లో 44 వేల 734 కార్డులు ఇచ్చామన్నారు. మరో 97 వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

రానున్న నాలుగేళ్లలో 3లక్షల మందికి ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్ తయారీ రంగానికి ప్రోత్సాహంతో అవకాశాలు
పది మీటర్ల ఎత్తు వరకు తక్షణ భవన నిర్మాణాలకు అనుమతి
అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి కెటిఆర్ వెల్లడి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో రాబోయే నాలుగు సంవత్సరాల్లో 3 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎలక్ట్రానిక్ తయారీ రంగానికి ప్రోత్సాహంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో 250కి పైబడిన కంపెనీల్లో ఎలక్ట్రానిక్స్ రంగంలో ఒక లక్షా 60 వేల మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. ఎలక్ట్రానిక్స్ తయారీ, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత రంగంగా పరిగణించింది. విధాన రూపకల్పనలో భాగంగా పరిశ్రమల నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి ఒక ప్రత్యేక ఎలక్ట్రానిక్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రంలో విద్యుత్ వాహనాలు, ఇంధన నిల్వ వ్యవస్థలను సత్వరమే చేపట్టి.. తయారీ, ఆర్ అండ్ డీని అభివృద్ధి చేసేలా చూడటానికి విద్యుత్ వాహకం 2020 నుంచి 2030 వరకు ఇంధన నిల్వ విధానాన్ని ప్రారంభించింది. క్లస్టర్ అభివృద్ధిలో భాగంగా ఓఆర్ఆర్ వెలుపల 912 ఎకరాల విస్తీర్ణంలో రెండు ఎలక్ట్రానిక్ క్లస్టర్ల తయారీని కలిగి ఉంది. వచ్చే నాలుగేళ్లలో రూ. 75 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎలక్ట్రానిక్ తయారీ రంగం అభివృద్ధికి టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ రంగ పరిశ్రమలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. గత 6 సంవత్సరాల్లో 23 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చుకున్నాం. తెలంగాణ ఏర్పడక ముందు ఈ రంగంలో 50 వేల ఉద్యోగాలు మాత్రమే ఉండేవి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అదనంగా లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించుకున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తల కోసం కొత్త నిబంధనలు చేర్చామని కేటీఆర్ తెలిపారు. ఇక మరో ప్రశ్నలో టీఎస్ బీపాస్ విధానంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కేటీఆర్ సమాధానం ఇచ్చారు. టీఎస్ బీపాస్ విధానం ద్వారా.. 75 చదరపు గజాల వరకు ఎలాంటి అనుమతి అవసరం లేదు. 600 చదరపు గజాల వరకు 10 మీటర్ల ఎత్తు వరకు తక్షణ భవన అనుమతిని దరఖాస్తుదారుని స్వయం ధృవీకరణ ఆధారంగా ఇవ్వడం జరుగుతుంది. 10 మీటర్లకు పైబడి ఎత్తు కలిగిన భవనాలకు 21 రోజుల్లో అనుమతి ఇవ్వడం జరుగుతుంది. 80 శాతానికి పైగా దరఖాస్తులు తక్షణ ఆమోదం పొందుతాయి. ఈ విధానం అమల్లోకి వచ్చిన 100 రోజుల్లో 12 వేల 943 భవనాలకు అనుమతులు జారీ చేయడం జరిగింది. కేపీహెచ్‌బీ పాత భవనాల స్థానంలో కొత్త నిర్మాణాల ప్రతిపాదనలపై ఆలోచిస్తామని కేటీఆర్ చెప్పారు. గ్రామకంఠం విషయంలో ఉన్న ఇబ్బందులపై దృష్టి సారిస్తామన్నారు. టౌన్ ఎ÷-లానింగ్ సిబ్బందికి సంబంధించి.. కొత్తగా 200ల పైచిలుకు పోస్టులను మంజూరు చేశాం. ఈ పోస్టులను టీఎస్పీఎస్సీ ద్వారా భర్తీ చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు.

బెంగాల్లో వచ్చేది బిజెపి ప్రభుత్వమే

తన సభలకు హాజరవుతున్న జనమే ఇందుకు నిదర్శనం
బెంగాల్లో 130మంది బిజెపి కార్యకర్తల ప్రాణత్యాగం
బిజెపికి అధికారమిస్తే 70ఏళ్ల విధ్వంసానికి పరిష్కారం చూపుతాం
ఖరగ్‌పూర్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోడీ

కోల్‌కతా,మార్చి20(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం ఏశారు. ఇక్కడ అధికారంలోకి వచ్చేది కమలమేనని అన్నారు. తన సభలకు ప్రజలు భారీగా హాజరవుతున్నారని, రాష్ట్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజేపీ అని స్పష్టమవుతోందని చెప్పారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తును ఆకాంక్షిస్తూ దాదాపు 130 మంది బీజేపీ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారన్నారు. రాష్ట్రం సౌభాగ్యంతో కళకళలాడాలంటే బీజేపీ ప్రభుత్వమే రావాలని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో శనివారం జరిగిన బీజేపీ శాసన సభ ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ, బీజేపీని ఆశీర్వదించడానికి మీరంతా పెద్ద సంఖ్యలో రావడం నాకు దక్కిన గొప్ప గౌరవం. దీనినిబట్టి ఈసారి బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వమే ఏర్పడుతుందని స్పష్టమవుతోంది. సౌభాగ్యవంతమైన బెంగాల్ భవిష్యత్తు కోసం బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం తప్పనిసరి. ఈ పోరాటంలో 130 మంది బీజేపీ కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా బీజేపీ పశ్చిమ బెంగాల్ శాఖ అధ్యక్షుడు దిలీప్ ఘోష్‌ను మోదీ ప్రశంసించారు. దిలీప్ ఘోష్‌పై అనేక దాడులు జరిగాయని, ఆయనను హత్య చేసేందుకు కూడా ప్రయత్నాలు జరిగాయని, అయినప్పటికీ ఆయన పశ్చిమ బెంగాల్ భవిష్యత్తు కోసం కృషిని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆయనలాంటి నేత పార్టీకి అధ్యక్షుడు కావడం తనకు గర్వకారణమని చెప్పారు. నేడు ఆయన యావత్తు రాష్ట్రానికి కొత్త శక్తిని అందిస్తున్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 294 శాసన సభ స్థానాలకు ఎనిమిది దశల్లో ఎన్నికలు జరుగుతాయి. మార్చి 27న తొలి దశ పోలింగ్ జరుగుతుంది. ఏప్రిల్ 29న చివరి దశ పోలింగ్ జరుగుతుంది. మే 2న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈసారి బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు విధ్వంసం సృష్టించాయని, టీఎంసీ మీ ఆశల్ని చదిమేసిందని, గత 70 ఏళ్లుగా ప్రతి ఒక్కరికీ మీరు అవకాశం ఇచ్చారు, ఈసారి అయిదేళ్ల కోసం మాకు అవకాశం ఇవ్వండి అంటూ ప్రధాని మోదీ అన్నారు. మాకు పాలనను అందిస్తే, 70 ఏళ్ల విధ్వంసం నుంచి బెంగాల్ విముక్తి అవుతుందన్నారు. మా జీవితాలను మీకు త్యాగం చేస్తామ న్నారు. వాట్సాప్, ఇన్‌స్టా, ఎఫ్ బీలు ఓ గంట పాటు నిన్న పనిచేయలేదని, అప్పుడు అంద´రూ ఆందోళన చెందారని, కానీ బెంగాల్‌లో 55 ఏళ్ల నుంచి అభివృద్ధి జరగలేదన్నారు. మొదట కాంగ్రెస్, ఆ తర్వాత లెఫ్ట్, ఇప్పుడు టీఎంసీ ఈ రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధిని టీఎంసీ అడ్డుకుంటోందన్నారు. టీఎంసీ సిండికేట్ వ్యవహారంల వల్ల రాష్ట్ర పరిశ్రమలు మూతపడాయని, ఇక్కడ మాఫియా ఉద్యోగాలు మాత్రమే వర్ధిల్లుతున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్‌లో త్వరలో ఎనిమిది దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ తాజాగా బంగాల్‌లోని ఖరగ్‌పూర్‌కు వచ్చారు. మొదట కాంగ్రెస్, ఆ తర్వాత లెఫ్ట్, ప్రస్తుతం తృణమూల్.. బెంగాల్‌లో అభివృద్ధిని నిలిపివేశాయి. 'ఆయుష్మాన్ భారత్' పథకం కింద ఉచిత వైద్య చికిత్స తమకెందుకు దక్కడం లేదని బెంగాల్‌లోని పేదలు అడుగుతున్నారు. 'కిషాన్ సమ్మన్ నిధి' నుంచి తన ఖాతాలోకి వేల రూపాయలు ఎందుకు రావడం లేదని బెంగాల్ పేద రైతు అడుగుతున్నాడు. మమతా బెనర్జీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమే చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులు ప్రజలకు చేరకుండా అడ్డుకుంటున్నార'ని మోదీ విమర్శించారు.

ముంబైలో మరోమారు కరోనా విలయం

గడచిన 24 గంటల్లో మూడు వేలకుపైగా కేసులు

ముంబై,మార్చి20(ఆర్ఎన్ఎ): దేశ ఆర్థిక రాజధాని ముంబైలో కరోనా మారోమారు విలయతాండవం చేస్తోంది. గడచిన 24 గంటల్లో ఒక్క ముంబైలోనే మూడు వేలకుపైగా కేసులు నమోదయ్యాయి. గ్రేటర్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తెలిపిన వివరాల ప్రకారం మార్చి 14 నుంచి 19 వరకూ ముంబైలో కొత్తగా 13 వేల912 కరోనా కేసులు నమోదయ్యాయి. ఇంతేకాదు మరింతగా విస్తరిస్తున్న కరోనాకు అడ్డుకట్టవేసేందుకు అధికారులు మొత్తం 305 బిల్డింగ్‌లకు సీల్ వేశారు.

ముంబైలో ఫిబ్రవరి నుంచి కరోనా కేసులు పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవలి కాలంలో కరోనా కేసుల సంఖ్య మరింతగా పెరిగి, రోజుకు మూడు వేల కేసులు నమోదయ్యే స్థాయికి చేరుకుంది.

మార్చి 18న ముంబైలో 2,877కరోనా కేసులు నమోదుకాగా, మార్చి 19న 3,062 కరోనా కేసులు నమోదయ్యాయి.

పరిశీలనలో అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు

మండలిలో సభ్యుల ప్రశ్నకు మంత్రి హరీష్ సమాధానం

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. తెలంగాణ పరిపాలన ట్రిబ్యునల్ ఏర్పాటుపై శాసన మండలిలో ఎమ్మెల్సీ పురాణం సతీష్ ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం తరఫున మంత్రి సమాధానం ఇచ్చారు. ట్రిబ్యునల్ ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే కమిటీ వేసిందని, నివేదిక వచ్చిన అనంతరం సర్కార్ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. దేశంలో నాలుగైదు రాష్ట్రాల్లో మాత్రమే ఈ తరహా ట్రిబ్యునళ్లు ఉన్నాయని తెలిపారు. కమిటీ నివేదిక వచ్చాక లాభ నష్టాలపై పూర్తిస్థాయి చర్చ అనంతరం ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు.

శ్రీలంకలో లోయలో పడ్డ బస్సు

13మంది అక్కడిక్కడే మృతి

కొలంబో,మార్చి20(ఆర్ఎన్ఎ): శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు లోయలో పడింది. ఆ ప్రమాదంలో 13 మంది ప్రయాణికులు మరణించారు. మరో 31 మంది గాయపడ్డారు. పసార వద్ద ఉన్న మోనెరగాలా-బదుల్లా రోడ్డు దగ్గర ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు మీద నుంచి పక్కకు ఉన్న లోయలో బస్సు పడింది. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసు అధికారి తెలిపారు. గాయపడ్డవారిని సమీప హాస్పిటల్‌లో చేర్పించారు. చనిపోయిన వారి వివరాలు సేకరిస్తున్నారు. ఘటన జరిగిన విషయం తెలిసిన వెంటనే రెస్క్యూ టీమ్ అక్కడికి చేరుకుని క్షతగాత్రులను రక్షించే పనిలో పడింది.

యాదాద్రీశుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహా స్వామివారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్ రెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజే శారు. ఆలయ పునర్నిర్మాణ పనులను న్యాయమూర్తి పరిశీలించారు. నిర్మాణాలు భేష్‌గా ఉన్నాయని చెప్పారు. ఆర్కిటెక్ పనులు అద్భుతమైన రీతిలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆలయం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై తరచూ స్వామివారిని దర్శించుకుం టానని తెలిపారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీదేవి దర్శించుకున్నారు. శనివారం వేకువజామున అమ్మవారి అభిషేక సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు ఆమెకు అమ్మవారి ప్రతిమను అందజేశారు.

మహారాష్ట్రలో క్షీణించిన శాంతిభద్రతలు

రాష్ట్రపతి పాలనకు కేంద్ర మంత్రి డిమాండ్

ముంబై,మార్చి20(ఆర్ఎన్ఎ): మన్సుఖ్ హిరన్ హత్య కేసు, అంటిలియా భయోత్పాతం కేసులో ముంబై పోలీస్ అధికారి సచిన్ వజే అరెస్ట్ నేపథ్యంలో మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలనకు కేంద్ర మంత్రి రాందాస్ అథవలే డిమాండ్ చేశారు. ఉద్ధవ్ ఠాక్రే సర్కార్‌లో శాంతి భద్రతల పరిస్థితి దిగజారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ ఇల్లు అంటీలియా వెలుపల బాంబు కలకలం ఘటనలో పోలీస్ అధికారి సచిన్ వజే పాత్ర ఈ వ్యవహారం వెనుక భారీ కుట్ర దాగుందని వెల్లడిస్తోందని మంత్రి పేర్కొన్నారు. దేశంలో బడా పారిశ్రామికవేత్త అంబానీ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారని, ఆయన ఇంటి ముందు పేలుడు పదార్థాలు ఉంచడం వంటి భారీ కుట్ర వెనుక వాస్తవంగా ఎవరున్నారనేది నిగ్గుతేల్చాలని అథవలే డిమాండ్ చేశారు. సచిన్ వజేను ప్రేరేపిస్తున్న పెద్దమనుషులు ఎవరనేది గుర్తించాలని అన్నారు. మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధించాలని తాను కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాస్తానని ఆయన వెల్లడించారు.

మంత్రి కెటిఆర్‌తో గంటా భేటీ

-స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి కలసి రావాలని వినతి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): తెలంగాణ ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్‌ను తెలుగుదేశం సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం కలిశారు. శాసన సభ సమావేశాల సందర్భంగా బిజీగా ఉన్న కేటీఆర్‌తో అసెంబ్లీ టీ బ్రేక్ సమయంలో గంటా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. స్టీల్ ప్లాంట్ ఉద్యమానికి కేటీఆర్ మద్దతు తెలపడంతో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కేటీఆర్.. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు ఆయనను కలిసినట్లు గంటా శ్రీనివాసరావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రులతో కలిసి ఓ బృందంగా విశాఖకు వస్తామని కేటీఆర్ చెప్పినట్లు గంటా పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాలపై ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే గంటా శ్రీనివాసరావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. స్టీల్ ప్లాంట్ కోసం పోరాడుతానని గంటా ఆ సందర్భంగా ప్రకటించారు. ఈ క్రమంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అందరి మద్దతును కూడగడుతున్నారు.

భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కీలకమైంది : అమెరికా రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మార్చి 20: అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌తో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇవాళ ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు.

ఇండో పసిఫిక్ ప్రాంతం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటున్నట్లు అమెరికా రక్షణ మంత్రి తెలిపారు. ఆ ప్రాంత అంశంలో భారత్ కీలక భాగస్వామి అని ఆయన అన్నారు.

ఒకే విధమైన ఆలోచన ఉన్న ఇద్దర మధ్య సైనిక సహకారం కీలకమని ఆస్టిన్ చెప్పారు. అంతర్జాతీయ పరిణామాలు మారుతున్నాయని, అమెరికాతో భారత్ భాగస్వామ్య ప్రాముఖ్యత పెరుగుతోందని లాయిడ్ తెలిపారు. రెండు దేశాల నేతలు సంయుక్త ప్రకటన చేశారు. రెండు దేశాల మధ్య సైనిక సంబంధాలను పెంచే అంశంపై దృష్టి పెట్టామని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. చర్చలు ఫలప్రదంగా సాగాయన్నారు. సమగ్రమైన వ్యూహాత్మక భాగస్వామి సామర్థ్యాన్ని గుర్తిస్తున్నామని ఆయన అన్నారు. భారత రక్షణ రంగంలో ఎఫ్ డీఐలను ఆహ్వానిస్తున్నట్లు ఈ సందర్భంగా రాజ్‌నాథ్ తెలిపారు. ఇటీవల మిగ్21 కూలిన ఘటనలో మృతిచెందిన పైలట్‌కు అమెరికా రక్షణ మంత్రి నివాళి అర్పించారు

రెండ్రోజుల క్రితమే వ్యాక్సిన్ వేసుకున్న ఇమ్రాన్

-అయినా కరోనా బారిన పడ్డ పాక్ ప్రధాని

ఇస్లామాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): రెండు రోజుల క్రితం కరోనా వ్యాక్సిన్ తొలి డోసు వేయించుకున్న పాకిస్థాన్ ప్రధాని తాజాగా కరోనా బారినపడడం కలకలం రేపుతోంది. ఇమ్రాన్‌ఖాన్‌కు కరోనా వైరస్ సంక్రమించినట్టు ఆ దేశ ఆరోగ్యశాఖ మంత్రి ఫైజల్ సుల్తాన్ శనివారం వెల్లడించారు. ప్రధాని ప్రస్తుతం సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉన్నట్టు తెలిపారు. మరోవైపు, పాకిస్థాన్‌లో కరోనా వైరస్ కేసుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. శనివారం రికార్డు స్థాయిలో 3,876 కేసులు నమోదయ్యాయి. ఫలితంగా దేశంలో పాజిటివిటీ రేటు 9.4 శాతానికి చేరుకుంది. తాజా కేసులతో కలుపుకుని దేశంలో ఇప్పటి వరకు మొత్తం 6,23,135 కేసులు నమోదయ్యాయి. గత 24 గంటల్లో 40 మంది కరోనా మహమ్మారికి బలయ్యారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,799కి పెరిగింది. అలాగే, ఇప్పటి వరకు 5,79,760 మంది కరోనా కోరల నుంచి బయటపడ్డారు. 2,122 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యశాఖ అధికారులు తెలిపారు.

చరిత్రలో నేటినిజం



వంటింట్లో ధరల మంట !

నేటినిజం
ఆదివారం 21-3-2021

నిత్యవసర సరకుల ధరల దాడి ఎందాక పోతుందో తెలియడం లేదు. ఎందుకంటే చాపకింద నీరులా ధరలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమకు సంబంధం లేదన్న చందాన ఉంటున్నాయి. తాజాగా వంటనూనెల ధరలే ఇందుకు నిదర్శనం. ఈ వారం పదిరోజుల్లోనే లీటర్ నూనె ప్యాకెట్ అమాంతంగా పది నుంచి 20 రూపాయల వరకు పెరిగింది. ఇక కరోనా లాక్‌డౌన్ మొదలు ఒక్క వంటనూనెల ధరలే ఏకంగా 60నుంచి 70 రూపాయల వరకు పెరిగాయి. అయితే ఈ పెరుగుదల ఉప్పులు,ప్పులపైనా ఉన్నాయి. వీటిని ఎవరు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇవి కేంద్ర, రాష్ట్రాల్లో ఎవరు కంట్రోల్ చేస్తారో తెలియదు. ప్రభుత్వాల ప్రమేయం లేకుండానే వంటనూనెలు సహా నిత్యావసరాలు బగ్గుమంటున్నాయి. ధరల పెరుగు దలను ప్రభుత్వాలు అస్సలంటే అస్సలు పట్టించుకోవడం లేదు. ఇంట్లో ఏ కూర చేయాలన్నా దాదాపుగా వంట నూనె ఉండాల్సిందే. నూనె లేకపోతే వంట లేనట్టే అని ఒక్క మాటలో చెప్పొచ్చు. ఇప్పుడు ఈ వంట నూనె ఇంట్లో గొడవలకు కారణం అవుతోంది. వంట నూనె ధర భారీగా పెరిగిందని సామాన్యుఉల పెదవి విరవడం తప్ప చేసేదేమీ లేదని గుర్తించారు. అందుకే ట్రేడర్లు మెల్లగా రోజుకో రూపాయి,రెండు అలా పెంచుతూ పోతున్నాయి. ఇకపోతే ఇటీవలి కాలంలో గత మూడు నెలల్లో వంటి నూనె ధర పెరుగుతూనే వస్తోంది. దీంతో సామాన్యులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. ఆయిల్ ధర సామాన్యులకు చుక్కలు చూపిస్తోంది. గత ఏడాది అక్టోబర్ కన్నా ముందు లీటరుకు రూ.90 నుంచి రూ.100 వరకు ఉండేది. గత మూడు నెలల కాలంలోనే ఆయిల్ ధర భారీగా పెరిగింది. రిఫైన్డ్ ఆయిల్ ధర కూడా ఇలానే ఉంది. మూడు నెలల కిందట 15 కేజీల ఆయిల్ టిన్ ధర రూ.1650గా ఉండేది. ఇప్పుడు ధర రూ.1950గా ఉంది. ఒక్క లీటరు రిఫైన్డ్ ఆయిల్ ధర రూ.98 నుంచి రూ.170కు పెరిగింది. అయితే ఇక్కడ సామాన్యులకు మరో ఝలక్ తగలనుంది. ఆయిల్ ధర రానున్న రోజుల్లో మరింత పెరిగే ఛాన్స్ ఉందనే అంచనాలు నెలకొన్నాయి. ఆయిల్ ధరలు పెరగడానికి ప్రధాన కారణం మనం ఉపయోగించే వంట నూనెలో దాదాపు 65 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. విదేశాల్లో ఆయిల్ ధర పెరిగింది. పంట నష్టం ఇందుకు కారణం. దీంతో ఈ ప్రభావం మనపై కూడా పడుతోంది. మనదగ్గర పల్లీలు, కుసుమలు, పొద్దు తిరుగుడు పంటలకు అవకాశం ఉన్నా గిట్టుబాటు ధరలు లేవు. దీంతో నూనె ధర భారీగా పెరిగింది. కరోనాతో అన్ని వస్తువుల ధరలు పెరిగినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. ధరల పెరుగుదల తమ అజమాయిషిలో లేదన్న భావనలో ఉన్నట్లుగా ఉంది. గతేడాది కరోనాతో చికెన్ ధర పెరిగింది.. ఉల్లిపాయల ధరలు పెరిగాయి.. బంగాళాదుంప రేటు పైకి కదిలింది.. ఇలా ధరలు పెరిగాయనే వార్తలు సామాన్యుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి. తాజాగా తారాజువ్వాలా నూనెధరలు దూసుకుని పోతున్నాయి. వంట నూనె ధర పెరిగిపోవడంతో సామాన్యులకు చుక్కలు కనిపిస్తున్నాయి. శనగకాయ నూనె, సన్ ఫ్లవర్ నూనె ఇలా పలు రకాల వంట నూనెల ధరలు పైకి కదిలాయి. ఏకంగా 20 నుంచి 30 శాతం మేర పెరిగాయి. ఇకపోతే దేశంలోకి పామ్ ఆయిల్ దిగుమతులు పెరుగుతున్నాయి. అయితే లాక్ డౌన్ కారణంగా మలేసియా వంటి పలు దేశాల్లో పామ్ ఆయిల్ తయారీ మాత్రం తగ్గింది. దీంతో ఆ దేశాలు ధరలు పెంచేశాయి. ఈ ప్రభావం ఇప్పుడు మనపై పడుతోంది. కేంద్ర ప్రభుత్వం మాత్రం ధరల పెరుగు దలను నియంత్రించడానికి ఏమాత్రం ప్రయత్నిస్తున్న దాఖలాలు కానరావడం లేదు. సన్ ఫ్లవర్, పామ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. నూనె ధర పెరిగిపోవడంతో సామాన్యులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతోంది. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. అన్నచందగా మారింది బీజేపీ పాలన తీరు. ఒక వైపు పప్పు, ఉప్పులు మొదలు కొని పెట్రోల్ , డీజల్ ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం మరోసారి వంట గ్యాస్ ధరను అమాంతం పెంచేసింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ఎన్నడూ లేని విధంగా వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.225 పెంచడంతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఓ వైపు పెట్రోల్ , డీజల్ ధరలు సెంచరీకి చేరువలో ఉండగా, గ్యాస్ ధర మాత్రం వెయ్యికి చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సామాన్యుడి నడ్డి విరిచే విధంగా ధరలు పెంచుకుంటూ పోవడంతో ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు నెలలుగా కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ధరలు సామాన్య ప్రజలను నట్టేట ముంచేలా ఉన్నాయి. కొవిడ్ నేపథ్యంలో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రస్తుత తరుణంలో గ్యాస్ సిలిండర్ ధరలు గుదిబండలా మారుతున్నాయి. తాజాగా వంట గ్యాస్ సిలిండర్ రూ.25, వాణిజ్య సిలిండర్ ధర రూ.95కు పెంచడంతో మూడు నెలల వ్యవధిలోనే రూ.225 పెరిగింది. డిసెంబర్ 2న వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.670 నుంచి రూ.718 పెంచారు. జనవరి ఒకటిన రూ.718 ఉన్న గ్యాస్ ధరను రూ.768కు, ఫిబ్రవరి 5 నాటికి రూ.793కు చేరుకుంది. ఫిబ్రవరి 15న మరో మారు ధర పెరగడంతో రూ.843కు చేరుకున్నది. ఐదు రోజుల వ్యవధిలోనే తాజా పెంపు తో కలిపి రెండు సార్లు వంట గ్యాస్ పై రూ.50 రూపాయలు వడ్డన విధించారు. దీంతో ప్రస్తుతం సిలిండర్ ధర రూ.893 రూపాయలకు చేరుకుంది. వాణిజ్య సిలిండర్ ధరపై 95 రూపాయలు పెరగడంతో ఒక్క సిలిండర్ ధర రూ.1810.50కు చేరింది. కామారెడ్డి జిల్లాలో 2 లక్షల 44 వేల మంది వినియోగదారులు ఉన్నారు. ఒక్కో సిలిండర్‌పై పెరిగిన ధరతో చూస్తే జిల్లాలో 5 కోట్ల 50 లక్షల భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు ప్రత్యక్షంగా మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది.

విద్యుత్ ఛార్జీలను పెంచడం లేదు: జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి స్పష్టం చేశారు. శాసనమండలిలో విద్యుత్ ఛార్జీల విషయంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కరోనా సంక్షోభ సమయంలో విద్యుత్ సంస్థలకు నష్టాలు వచ్చాయి. అయినప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదని స్పష్టం చేశారు. కొవిడ్ సందర్భంలో బిల్లులు ఎక్కువ వచ్చాయని చెప్పడం నిరాధారమన్నారు. కొంతమంది కావాలని చెప్పి.. విద్యుత్ రంగంపై అనవసర పుకార్లు సృష్టించారు. సాంకేతిక లోపం కారణంగానే కొన్ని చోట్ల బిల్లులు అధికంగా వచ్చిన మాట వాస్తవమే. అది తమ దృష్టికి వచ్చిన తర్వాత ఆ బిల్లులను సరిదిద్దామని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

ఇక ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనేది లేదు

ఇంతగా డబ్బులు ఖర్చు చేయడం బాధ కలిగిస్తోంది

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నారెడ్డి నిర్వేదం

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్ సీనియర్ నేత,ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి చిన్నారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇకపై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. ఎన్నికలు చాలా ఖరీదుఐనవిగా మారాయన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ఇంతగా ఖర్చు పెడతారని తాను ఊహించలేదన్నారు. శనివారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ డబ్బులు లేకపోతే ఎవరు కూడా ఎన్నికల్లో పోటీచేయవద్దని తన విన్నపమన్నారు. పట్టభద్రులు సైతం అధికార టీఆర్ఎస్‌కు ఓట్లు అమ్ముకోవటం బాధ కలిగిస్తోందని అన్నారు. కేవలం డబ్బులు పంచలేకపోవటం వలనే తనకు ఓట్లు పడలేదని చెప్పారు. తనకున్న పలుకుబడి 32వేల ఓట్లకే పరిమితం అనుకుంటున్నానన్నారు. డబ్బు ఖర్చు చేయటంలో కేసీఆర్‌ను మించి ఎవరూ లేరని, అందువల్ల భవిష్యత్‌లో ఎవరు తట్టుకోలేరని ఆయన వ్యాఖ్యానించారు. నాగార్జునసాగర్‌లో జానారెడ్డి మాత్రమే టీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌ను తట్టుకోగలరన్నారు. తమ పార్టీ నాయకత్వం, రేవంత్ రెడ్డి శక్తికి మించి తనకు సహకరించారని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ పునఃనిర్మాణం కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. తాగుబోతులు, లంచగొండి రాష్ట్రంగా మార్చిన కేసీఆర్ నుంచి తెలంగాణను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని చిన్నారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

నల్లగొండలో ఎలిమినేషన్‌లో ఎగిరిపోయిన బిజెపి అభ్యర్థి

-తాజాగా ముగ్గురి మధ్యే పోటీ..ముందంజలో పల్లా

నల్లగొండ,మార్చి20(ఆర్ఎన్ఎ): ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతున్నది. రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో భాగంగా అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియ జోరుగా జరుగుతున్నది. కాంగ్రెస్ అభ్యర్థి రాముల్ నాయక్ ఎలిమినేట్ అయ్యారు. అలాగే బిజెపి అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి కూడా ఎలిమినేట్ అయ్యారు. దీంతో ఇక బరిలో ముగ్గురే మిగిలారు. దీంతో ఇప్పటివరకు 67 మంది ఎలిమేనేషన్ అయ్యారు. రాముల్ నాయక్ ఎలిమినేట్ అనంతరం.. పల్లా రాజేశ్వర్ రెడ్డికి 5252 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి తీన్మార్ మల్లన్నకు 7352 ఓట్లు, ప్రొఫెసర్ కోదండరామ్‌కు 10,299 ఓట్లు వచ్చాయి. దీంతో టీఆర్ఎస్‌కు 1,22,638 ఓట్లు రాగా, తీన్మార్ మల్లన్న 99,210, కోదండరామ్ 89,409 ఓట్లతో తొలి మూడు స్థానాల్లో కొనసాగుతున్నారు. మొత్తంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి 23,428 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. కాగా, ప్రస్తుతం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఎలిమినేషన్ ప్రక్రియ ఉత్కంఠ రేపుతోంది. బీజేపీ అభ్యర్థి బదలాయింపు ఓట్లపై మల్లన్న, కోదండరాం ఆశలు పెట్టుకున్నారు. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ 42,015 బదలాయింపు ఓట్లు ప్రస్తుతం కీలకం కానున్నాయి. 23,432 ఓట్ల ఆధిక్యంలో పల్లా కొనసాగుతున్నారు. 9800 ఓట్ల తేడాతో మల్లన్నపై కోదండరాం పోటీ పడుతున్నారు. కోదండరాంకు ఓట్లు పెరిగితే తీన్మార్ మల్లన్న ఎలిమినేషన్ కానున్నారు.

దేశంలో శరవేగంగా వ్యాక్సిన్ ప్రక్రియ

-4.2కోట్లు దాటినట్లు వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): కోవిడ్ వ్యాక్సినేషన్‌లో భారత్ కొత్త మైలురాయిని అందుకున్నది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా కొవిడ్ టీకా తీసుకున్న వారి సంఖ్య 4.2 కోట్లు దాటింది.శనివారం ఉదయం 7 గంటల వరకు 4 కోట్ల 20 లక్షల 392 మందికి వ్యాక్సిన్ ఇచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత 24 గంటల్లో 27 లక్షల మందికి కొవిడ్ టీకా ఇచ్చినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ చెప్పింది. అయితే మహారాష్ట్ర, పంజాబ్, కర్నాటక, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త కరోనా వైరస్ కేసులు నమోదు అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అధిక సంఖ్యలో కోవిడ్ టీకాలు ఇచ్చిన జాబితాలో భారత్ రెండవ స్థానంలో నిలిచింది. అత్యధిక సంఖ్యలో టీకాలు ఇచ్చిన దేశాల్లో అమెరికా టాప్‌లో ఉంది.

పారిశుద్య కార్మికురాలు దారుణహత్య

వికారాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కుల్కచర్ల మండలం చౌడాపూర్ గ్రామంలో దారుణం జరిగింది. గ్రామ పారిశుద్ధ్య కార్మికురాలు మైసమ్మ (58) దారుణ హత్యకు గురైంది. ఇంట్లో నిద్రిస్తుండగా మహిళపై దాడి చేసిన గుర్తుతెలియని దుండుగులు... వెండి, నగదును దోచుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన మహిళను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీ కోసమే హత్య చేశారా.. మరేదైనా కారణమా అనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

దిగివస్తున్న ఉల్లిధరలు

కర్నూలు మార్కెట్‌కు పోటెత్తిన సరుకు
హైదరాబాద్‌లో వందకు నాలుగు కిలోలుగా అమ్మకం

కర్నూలు,మార్చి20(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఉల్లిపాయల ధర బాగా తగ్గింది. హైదరాబాద్ మార్కెట్లో ప్రస్తుతం రిటైల్‌గా వందకు నాలుగు కిలోలు అమ్ముతున్నారు. అంటే 25 రూపాయలకు కిలోగా ఉంది. ఇటీవల కొంచె తగ్గుదల కనిపించిన వస్తువు ఏదైనా ఉందంటే అది ఉల్లిపాయ మాత్రమే. అయినా ఈ రేటు కూడా సామాన్యలకు భారంగానే ఉంది. కర్నూలు మార్కెట్‌లో ఈ నెల మొదటి వారంలో క్వింటా ధర సగటున రూ.2,100 పలకగా, ప్రస్తుతం రూ.1,100కి పడిపోయింది. పక్షం రోజుల్లో క్వింటాకు రూ.1000 తగ్గింది. మార్కెట్‌లో క్వింటా కనిష్ఠ ధర రూ.680, గరిష్ఠ ధర రూ.1,320 పలికాయి. కాగా రిటైల్ మార్కెట్‌లో నాణ్యమైన లావు సైజు ఉల్లి కిలో రూ.30-36, సన్న రకం ఉల్లి రూ.25 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారుల కొనుగోలు ధర తగ్గినా, రవాణా ఛార్జీలు, తరుగుల విలువ వేసుకుని, రిటైల్ అమ్మకాలు సాగిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు ఉల్లి నిల్వచేయడానికి మహారాష్ట్ర నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. ఏపీ, మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో ఉల్లి పంట కోతకొచ్చి, కొత్త ఉత్పత్తి విరివిగా మార్కెట్‌కు వస్తోంది. కర్నూలు మార్కెట్ యార్డుకే రోజూ నాలుగైదు వేల క్వింటాళ్ల ఉల్లిపాయలు అమ్మకానికి వస్తున్నాయి. రాష్ట్రంలో రబీ సీజన్‌లో 16వేల ఎకరాల్లో ఉల్లి సాగైంది. ప్రస్తుతం ఈ పంటే మార్కెట్‌కు వస్తోంది. గత ఖరీఫ్‌లో ఏపీలో 50వేల ఎకరాల్లో ఉల్లి సాగైనా, ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతిన్నది. దీంతో గత నవంబరు, డిసెంబరులో ధరలు పెరిగాయి. ఒక దశలో ఉల్లి కిలో రూ.200 కూడా పలికింది. గత నెలలో రిటైల్‌గా కిలో రూ.50 దాకా ఉంది. ప్రస్తుతం ఏపీతో పాటు మహారాష్ట్రలోనూ ఉల్లి ఉత్పత్తి భారీగా మార్కెట్‌కు వస్తోంది. దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయని అధికారులు చెబుతున్నారు. మరో నెల దాకా ధరల తగ్గుదల ఉంటుందని భావిస్తున్నారు. ఎండాకాలంలో ఉల్లిపాయ వాడకం కూడా ఎక్కువగానే ఉంటుంది. మోడీ అధికారం లోకి వచ్చినప్పుడు ఉల్లిపాయల ధరలు 5ను ంచి పదిలోపు ఉండగా ఇప్పుడు వందదాకా పెరిగాయి. ఇప్పుడు 25వరకు దిగి వచ్చాయి.

వైకల్యాన్ని జయించిన క్రీడాకారుడు

క్రీడాకారులకు అతనో స్ఫూర్తిప్రదాత
వైకల్యాన్ని అధిగమించిన విశ్వ క్రీడా విజేతగా అవతరింపు
మాదాసు శ్రీనివాసరావు మరణం క్రీడారంగానికి తీరనిలోటు

కరీంనగర్,మార్చి20(ఆర్ఎన్ఎ): అతని క్రీడా ప్రతిభ ముందు వైకల్యం తలవంచింది.. పుట్టుకతో అవిటివాడైనా నడలని ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ప్రపంచస్థాయి పోటీలో జగజ్జేతగా నిలిచి విశ్వక్రీడా యవనికపై త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించాడు. అర్జున అవార్డుతో కరీంనగర్‌కు జాతీయ ఖ్యాతి నందించాడు. దివ్యాంగ క్రీడాకారులకు ఆయన ఓ స్ఫూర్తి.. ఆదర్శం. దివ్యాంగుడైనా పట్టుదల.. సడలని ఆత్మవిశ్వాసం.. మనోధైర్యంతో ప్రపంచ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచాడు. ఆటే శ్వాసగా ప్రతీ పోటీలో పతకాలు సాధిస్తూ జాతీయ పతాకాన్ని రెపరెపలాడించాడు. ఆయన క్రీడా ప్రతిభ ముందు వైకల్యం తలవంచింది. అంతర్జాతీయ పారా ఒలింపిక్ క్రీడాకారుడు మాదాసు శ్రీనివాసరావు (68) అంటే తెలియని వారు ఉండకపోవచ్చు. అలాంటి ప్రతిభ కలిగిన ఓ క్రదీడాకరుడి మృతి క్రీడా లోకానికి తీరని లోటుగానే భావించాలి. అలాగే వికలాంగుడయినా ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడు. తన అసమాన క్రీడా ప్రతిభతో పలు క్రీడల్లో పారా ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్, ఏషియన్ మీట్ కామన్‌వెల్త్ గేమ్స్, దివ్యాంగుల విభాగంలో బ్యాడ్మింటన్ షూటింగ్ టేబుల్ టెన్నిస్, ఫెన్సింగ్ వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో పలు పతకాలు కైవసం చేసుకొన్నారు. అంతేకాక పలు మారథాన్ రన్ వీల్‌చైర్‌లో విజయాలు సొంతం చేసుకున్నాడు. 2003లో నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంచే అందుకున్న అర్జున పురస్కారంతో అప్పటి నుంచి అర్జున శ్రీనివాస్‌గా పిలుస్తున్నారు. ఈ అవార్డు రావడంపై అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ లక్ష రూపాయల నజరానాను అందించాడు. 2017లో ప్రభుత్వం దివ్యాంగ స్ఫూర్తి అవార్డును అందించింది. అంతర్జాతీయ క్రీడకారులకు ఇల్లు రిజిస్ట్రేషన్‌కు అయ్యే చార్జీలను ఉచితంగా ఇవ్వాలనే జీవోను తీసుకురావడంలో శ్రీనివాసరావు కృషి చేశారు. చివరికి క్యాన్సర్‌తో ఆయన సాగించిన పోరాటంలో పరాజితుడై తుది శ్వాస విడిచాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన అర్జున అవార్డు గ్రహీత మాదాసు శ్రీనివాస్ రావు క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాడు. మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన శ్రీనివాస్‌రావు వృత్తి రీత్యా ఆర్టీసీలో మెకానిక్‌గా చేరారు. ఉత్తమ దివ్యాంగ ఉద్యోగిగా 1994లో జాతీయ స్థాయి అవార్డును అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాల్ శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. దివ్యాంగుల జాతీయ క్రీడా సంఘానికి అనుబంధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పారా స్పోర్ట్స్ సంఘం ఏర్పాటు చేశారు. 1996లో లండన్‌లో జరిగిన దివ్యాంగుల ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించారు. 2002లో బెంగళూరులో జరిగిన వరల్డ్ పారా బ్యాడ్మింటన్‌లో స్వర్ణం సాధించారు. దీంతో భారత ప్రభుత్వం 2003లో అర్జున అవార్డు ప్రకటించింది. అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గ్వాంగ్ జూలో జరిగిన ఏసియన్ పారా ఫెన్సింగ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించారు. 2004లో మలేసియాలో జరిగిన మెన్స్ డబుల్స్ ఏసియన్ పారా బ్యాడ్మింటన్‌లో కాంస్య పతకం, 2006లో ఇజ్రాయిల్‌లో జరిగిన సింగిల్స్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో కాంస్యం, 2010లో ఢిల్లీలో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో బ్యాటన్ రిలేలో ప్రతిభ కనబరిచారు. 2006 నుంచి ముంబయి మారథాన్ రన్‌లో వరుసగా పాల్గొన్నారు. చివరగా 2018లో బెంగళూర్ జరిగిన రన్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పారా అ÷-లథెట్ల విభాగంలో అర్జున పురస్కారాన్ని పొందిన తొలి క్రీడాకారుడిగా రికార్డ్ సాధించారు. 2010లో చైనాలోని

త్వరగా రోడ్డు నిర్మాణ పనుల పూర్తి

-అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి వేముల

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): రోడ్డు నిర్మాణాలకు సంబంధించి అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. త్వరగా రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నామని అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా నర్సంపేట -కొత్తగూడ రోడ్డు పనులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఈ రోడ్డు రెండు భాగాలుగా కలిగి ఉంది. ఒకటి నర్సంపేట - పాకాల రోడ్డు(9 కిలోమీటర్లు)ను డీఎంఎఫ్‌టీ కింద మంజూరు చేశాం. ఇల్లందు ? పాకాల రోడ్డు(25 కిలోమీటర్లు)ను ఇప్పటికే మంజూరు చేశామన్నారు. ఒకటో రోడ్డు పనుల కోసం టెండర్లను ఆహ్వానించామన్నారు. రెండో భాగం రోడ్డు పనులకు టెండర్లు పూర్తయ్యాయి. వన్యప్రాణుల బోర్డు అనుమతి ఇవ్వడంలో జాప్యం వల్ల రెండో భాగం రోడ్డు పనుల్లో ఆలస్యం జరుగుతుందన్నారు. రెండు నెలల్లో నర్సంపేట - పాకాల రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా చూస్తామన్నారు. త్వరలోనే ఫారెస్టు డిపార్ట్‌మెంట్ నుంచి అనుమతి రాగానే ఇల్లందు - పాకాల రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు.

జిల్లాలో లాక్‌డౌన్ అంటూ తప్పుడు వార్తలు: కలెక్టర్

అమరావతి,మార్చి20 (ఆర్ ఎన్ఎ):జిల్లాలో ఈనెల 21వ తేదీ నుంచి లాక్ డౌన్ అని ఆర్టీవీ పేరుతో వస్తున్న వార్తలు తప్పుడు వార్తలని జిల్లా కలెక్టర్ గంధం చంద్రుడు తెలిపారు. కరోనా నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తెలిపినట్లు ఆర్టీవీ పేరుతో జిల్లా లో లాక్ డౌన్ ప్రకటించినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న న్యూస్ తప్పుడు న్యూస్ అన్నారు. ఈ వార్తలు గతేడాది వచ్చిన వార్తలని, ఎవరో పొరపాటున సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని తెలిపారు. ఇలాంటి నిరాధారమైన వార్తలను, వదంతులను ప్రజలు నమ్మరాదన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఎలాంటి లాక్ డౌన్ లేదన్నారు.

నిర్ణీత గడువులోపు బిల్లులు సమర్పించాలి.....

-జిల్లా ఖజానా అధికారి కవిత.

సంగారెడ్డి, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి) మార్చి 31తో ముగియ నున్న ఈ ఆర్థిక సంవత్సరానికి (2020-21) సంబంధించిన బిల్లులను నిర్ణీత గడువులోపు సమర్పించాలని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కవిత ఒక ప్రకటనలో కోరారు.రెగ్యులర్ వేతన బిల్లులు, జిపిఎఫ్, గృహనిర్మాణ , మోటార్ సైకిల్ అడ్వాన్స్ లు, తదితర అడ్వాన్స్ బిల్లులు సమర్పించుటకు ఈ నెల 25 చివరి తేదీ యని, ఇతర అన్ని బిల్లులు మార్చి 20 నుండి 24 వరకు మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.టెలిఫోన్, వాటర్, విద్యుత్ బిల్లులను మాత్రం అన్ని పని రోజులలో తీసుకుంటారని ఆమె పేర్కొన్నారు.జిల్లా కోశాధికారి పరిధిలో గల డి డి వో లు తమ బడ్జెట్ ల్యాప్స్ కాకుండా నిర్ణీత తేదీలోపు బిల్లులను సమర్పించాలని ఆమె సూచించారు.

క్రీడా హబ్‌గా మారుతున్న తెలంగాణ

-క్రీడాకారులకు ప్రోత్సాహమిస్తున్నామన్న మంత్రి

హైదరాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం క్రీడాహబ్‌గా రూపొందుతుందని రాష్ట్ర ఆబ్కారీ, క్రీడా, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. క్రీడాకారులకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న ఎకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. తెలంగాణ కు చెందిన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలను సాధించిన క్రీడాకారులకు సిఎం కెసిఆర్ నగదు పురస్కారాలను అందిస్తున్నామన్నారు. క్రీడా పాలసీలో భాగంగా రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి అత్యుత్తమ పాలసీని ప్రకటించబోతున్నామన్నారు. అందులో భాగంగా క్రీడల అభివృద్ధికి , మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రులతో క్యాబినేట్ సబ్ కమిటి నియమించారన్నారు. గ్రామీణ క్రీడా కారులను తీర్చిదిద్దుతున్నామన్నారు. హైదరాబాద్ లో మార్చ్ 31 నుండి ఏప్రిల్ 4 వ తేది వరకు సరూర్ నగర్ స్టేడియంలో జరుగనున్న 43 వ జూనియర్ బాలికల జాతీయ హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్ బ్రోచర్ ను జాతీయ హ్యాండ్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ రావు తో కలసి శుక్రవారం హైదరాబాద్ లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమ క్రీడా మౌలిక సదుపాయాలను కలిగి వున్న నగరం హైదరాబాద్ నగరమన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు సిఎం కెసిఆర్ , మంత్రి కేటిఆర్ ప్రణాళికలను రూపొందిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జాతీయ హ్యాండ్ బాల్ ఫెడరేషన్ అధ్యక్షులు జగన్ మోహన్ రావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్

ర్యాంకు సాధించిన రవిని సన్మానించిన ఏనుగు మనోహర్ రెడ్డి

రాజన్న సిరిసిల్లా, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి):శాత్రాజుపల్లి యువకుడికి 103 వ గేట్ ర్యాంక్ వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి కి చెందిన సురికంటి రవి గేట్- 2021 ఫలితాలలో 103 వ ర్యాంక్ సాధించిగా , రవి నిటీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించి , అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో .అనంతరెడ్డి ,వెంకట్ రెడ్డి, సుభాష్ యూత్ క్లబ్ అధ్యక్షుడు సాయిగౌడ్ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ వినోద్ కుమార్, మంత్రి ఈటెల



కరీంనగర్, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి):టిఆర్ఎస్ నాయకుడు సాజిద్ ఖాన్ కుమారుడు ఫురఖాన్ శర్జిల్ ఉజ్జమా ఖాన్ వివాహ రిసెప్షన్ నగరంలోని వి కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం జరిగింది. ఈ వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్ కుమార్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటెల రాజేందర్, చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, హజ్ కమిటీ చైర్మన్ మసిఉల్లాహ్ ఖాన్, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ లు హాజరై వరుడికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలోఎంఐఎం సహాయ కార్యదర్శి సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, ఫసియుద్దీన్ ఖాలీద్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, పలువురు కార్పొరేటర్లు, టిఆర్ఎస్ నేతలు హాజరయ్యారు.

కరోనా వ్యాక్సిన్‌పై భయాలు అక్కర్లేదు: మంత్రి

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): కోవిడ్-19 వ్యాక్సిన్లపై ఎవరికీ అనుమానాలు అక్కర్లేదని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. శుక్రవారంనాడు లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ, ఎలాంటి భయం లేకుండా అందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో ఇంతవరకూ 3,93,39,817 మంది వ్యాక్సిన్ వేయించుకున్నట్లు తెలిపారు. కాగా, గత 24 గంటల్లో కొత్తగా 39,726 కరోనా కేసులు నమోదు కాగా, 20,654 మందికి స్వస్థత చేకూరినట్టు ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారంనాడు ప్రకటించింది. కొత్తగా వెలుగుచూసిన కోవిడ్ కేసులతో దేశంలో మొత్తం కేసుల సంఖ్య 1,15,14,331కు చేరుకుంది. వీటిలో 2,71,282 యాక్టివ్ కేసులుండగా, 1,10,83,679 మంది కోలుకున్నారు.

చంద్రబాబు కేసులో హైకోర్టు స్టే శుభపరిణామం

ఏం చేసినా చెల్లుతుందన్న భావన సరికాదు

ఐపిఎస్ అధికారి ప్రవీణ్ కుమార్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు: ఎంపి

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): రాజధాని అసైన్డ్ భూముల కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు స్టే ఇవ్వడం శుభపరిణామమని ఎంపీ రఘురామకృష్ణరాజు స్వాగతించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏం చేసినా చెల్లుతుందన్న తమ పార్టీ అభిప్రాయాన్ని ఇకనైనా మార్చుకోవాలని రఘురామకృష్ణరాజు సూచించారు. చంద్రబాబు, మాజీమంత్రి నారాయణ సీఐడీ విచారణపై ఏపీ హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. సీఐడీ కేసు విచారణపై న్యాయస్థానం 4 వారాలు స్టే విధించింది. స్పష్టమైన ఆధారాలు ఉంటే చూపించాలని సీఐడీని కోర్టు కోరింది. ప్రాథమిక విచారణలో ఏం గుర్తించారని ధర్మాసనం ప్రశ్నించింది. విచారణ తొలి దశలో వివరాలు చెప్పలేమని, పూర్తి స్థాయి విచారణకు అనుమతించాలని హైకోర్టును సీఐడీ అధికారులు కోరారు. ఇప్పటి వరకు చేసిన దర్యాప్తులో చంద్రబాబు, నారాయణకు వ్యతిరేకంగా సాక్ష్యాలున్నాయా? అని హైకోర్టు ప్రశ్నించింది. ఇదిలావుంటే తెలంగాణలో సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో ఉన్న ఐపీఎస్ ప్రవీణ్ కుమార్‌పై రాష్ట్రపతి కోవిందుకు రఘురామకృష్ణ రాజు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాష్ట్రపతితో భేటీ అయిన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడారు. దేవుడు లేడంటూ ప్రచారం చేస్తున్నారని రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. లా/జస్టిస్, పర్సనల్ విభాగం స్టాండింగ్ కమిటీలో సభ్యుడిని కాబట్టి ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకు వెళ్లానన్నారు. ఐపీఎస్ ప్రవీణ్ కుమార్ అదుపులో ఉంటే మంచిదని సూచించారు.

సేంద్రీయ సాగుకు నగదు ప్రోత్సాహకం

-విజయసాయి ప్రశ్నకు తోమర్ సమాధానం

న్యూఢిల్లీ,మార్చి20(ఆర్ఎన్ఎ): సేంద్రీయ సాగుకు నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు అలాగే దేశంలో సేంద్రీయ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలు రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభలో వి.విజయసాయి రెడ్డి ప్రశ్నకు సమాధానం ఇచ్చిన నరేంద్ర సింగ్ తోమర్... అంతర్జాతీయ ప్రమాణాలను పాటించే 'నేషనల్ స్టాండర్డ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్' ప్రకారం ఏడాది పొడుగునా సాగుచేసే పంటలు, సాంప్రదాయ సేద్యం నుంచి సేంద్రీయ సేద్యానికి మారడానికి మూడేళ్ళ కాలపరిమితి ఉంటుంది. ఈ మార్పు జరిగే కాలంలో రైతులు తమ భూములను ఖాళీగా పెట్టకుండా ఎన్ఎస్ఓపీ ప్రమాణాలను అనుసరించి సేద్యం చేసుకోవచ్చు.

ఆ విధంగా సాగు చేసిన భూముల్లో పండిన పంటను సేంద్రీయ సాగుకు మారుతున్న పంటగా గుర్తించి విక్రయించు కోవచ్చు. 'పరంపరగత్ కృషి వికాస్ యోజన (పీకేవీవై) కింద దేశంలో సేంద్రీయ సాగును ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది అని తెలిపారు.

ఈ పథకం కింద సేంద్రీయ సేద్యం చేసే రైతులకు పంట వేయడం నుంచి పంట దిగుబడికి సర్టిఫికేషన్, మార్కెటింగ్ వరకు అన్ని దశలలో ప్రభుత్వం చేదోడుగా ఉంటుంది. సేంద్రీయ సేద్యం చేసే రైతులను ప్రోత్సహించేందుకు పంట దిగుబడి వచ్చిన తర్వాత వాటిని ప్రాసెస్, ప్యాకింగ్, మార్కెటింగ్ చేసే పక్రియలన్నీ ఈ పథకంలో అంతర్భాగంగా ఉంటాయన్నారు మంత్రి తోమర్. పీకేవీవై పథకం కింద సేంద్రీయ సేద్యం చేసే రైతులకు మూడేళ్ళపాటు హెక్టారుకు 31 వేల రూపాయల చొప్పున నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో ప్రభుత్వం సొమ్మును జమ చేస్తుంది అని తెలిపారు. ఈ సొమ్ముతో రైతులు బయో ఫెర్టిలైజర్స్, బయో పెస్టిసైడ్స్, ఆర్గానిక్ మేన్యూర్, కంపోస్టు, వర్మి కంపోస్టు, బొటానికల్ ఎక్స్‌ట్రాక్ట్స్ కొనుగోలు చేసుకోవచ్చు అన్నారు.

మహారాష్ట్రలో కేసులు పెరుగుదల

సరిహద్దు జిల్లాల్లో ఆందోళన
అప్రమత్తం అయిన అధికారులు

నిజామాబాద్/ఆదిలాబాద్,మార్చి20(ఆర్ఎన్ఎ):మహారాష్ట్రలో కరోనా ఉధృతి నేపథ్యంలో నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఇరుజిల్లాలు మహారాష్టరకు సరిహద్దుల్లో ఉన్నాయి. ఈ రెండు జిల్లాల వాసులు తరచూ ఇక్కడి నుంచి సరిహద్దు మహారాష్ట్రకు వెళుతుంటారు. నిత్యవాసరాలు మొదలు వ్యాపార లావాదేవీలు చేస్తుంటారు. ఇప్పుడు మహారాష్ట్రలో కరోనా మరోమారు కల్లోలం సృష్టిస్తోంది. దీంతో అక్కడికి వెళ్లవద్దని సూచిస్తూ.. సరిహద్దులో ఉన్న ప్రభావిత గ్రామాల్లో పకడ్బందీ చర్యలు చేపట్టారు. కలెక్టర్లు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి కరోనా నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. సరిహద్దు ప్రాంతాలకు చెందిన గ్రామాలకు చెందిన వారు మహారాష్ట్రకు వెళ్లవద్దని సూచిస్తున్నారు. మహారాష్ట్రకు పోయివచ్చిన వారు హోం ఐసోలేషన్‌లో ఉండాలని, వ్యాధి లక్షణాలు కనపడితే నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని కోరుతున్నారు.

బాధితులను ప్రాథమిక దశలో గుర్తించి వారికి చికిత్సలు అందించడానికి అధికారులు చర్యలు చేపట్టారు.ఈ రెండు జిల్లాల్లో నాలుగైదు రోజులుగా రోజూ 35 నుంచి 40 కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిత్యం 2 వేల మందికి నిర్ధారణ పరీక్షలు చేయాలని అధికారులు నిర్ణయించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన వారు హోం ఐసోలేషన్‌లో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో కేసులు పెరుగుతుం డడంతో రెండు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లో ఇటీవల కరోనా కేసులు పెరుగుతున్నవి. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు బస్సులు, రైళ్లు నడుస్తున్నాయి.

వ్యాపారాలు, బంధువుల ఇళ్లకు, శుభకార్యాలకు వస్తుంటారు. మహారాష్ట్ర లో కరోనా ఉధృతి బాగా ఉండడంతో పక్క రాష్ట్రానికి పోయివచ్చిన వారి నుంచి వైరస్ సోకే ప్రమాదం పొంచి ఉంది. మహారాష్ట్ర నుంచి వచ్చిన వారు బయట ఇష్టానుసారంగా తిరుగుతుండడంతో కరోనా విస్తరించే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి వైరస్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లాలో రోజురోజుకూ కరోనా కేసులు పెరుగుతున్నందున అధికారులు పకడ్బంది చర్యలు చేపట్టారు. జైనథ్, బేల, తాంసి, తలమడుగు, గాదిగూడ మండలాల్లోని సరిహద్దున ఉన్న 71 ప్రభావిత గ్రామాలను గుర్తించి ప్రజలకు కరోనా నివారణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రోజూ 2 వేల ర్యాపిడ్ పరీక్షలు చేయాలని నిర్ణయించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున రెండు మొబైల్ వాహనాలను ఏర్పాటు చేసి పరీక్షలు చేస్తున్నారు. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజలు తప్పనిసరి మాస్కులు ధరించాలని, భౌతికదూరం పాటించాలని అధికారులు కోరుతున్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో కరోనా నివారణలో భాగంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కరోనా ప్రబలకుండా విస్తృతంగా అవగాహన నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర పోయివచ్చిన వారు బయట తిరగకుండా హోం ఐసోలేషన్‌లో ఉండేలా చూస్తున్నారు. ఇందుకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల సహకారం తీసుకుంటున్నారు. ప్రజలు కొవిడ్ నివారణకు సహకరించాలని, కరోనా నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. ఇకపోతే సరిహద్దు గ్రామాల్లోనే కాకుండా నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూస్తున్నాయి. దీంతో మరోసారి అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. నెల రోజుల క్రితం మహారాష్ట్రలో కరోనా కేసులు రావడంతో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమై సరిహద్దులో పరీక్షలు నిర్వహించింది. పెద్దగా పాజిటివ్ కేసులు రాకపోవడంతో రెండు రాష్ట్రాల సరిహద్దులోని సాలూరా చెక్‌పోస్ట్ వద్ద తప్ప మిగతా సరిహద్దు ప్రాంతాల్లో కరోనా పరీక్షలు నిర్వహించలేదు. నాలుగైదు రోజులుగా ఉమ్మడి జిల్లాకు ఆనుకొని ఉన్న మహారాష్ట్రలోని పట్టణాల్లో కరోనా కేసులు అనూహ్యంగా పెరిగాయి. మహారాష్ట్రలోని దెగ్లూర్‌లో ఐదు రోజులుగా కరోనా నేపథ్యంలో బంద్ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల మరాఠాల కాంటాక్ట్‌ల ఫలితంగా కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతున్నాయని వైద్యశాఖ అధికారులు అనుమానిస్తున్నారు.

జిల్లాలోని సాలూరా చెక్‌పోస్ట్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారితో పాటు బోధన్ ఆర్డీవో సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం తప్ప కొవిడ్ పరీక్షలు తగ్గిపోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకున్న వైద్య ఆరోగ్యశాఖ వెంటనే కొవిడ్ పరీక్షల కోసం దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశిరచింది. దీంతో రెండు, మూడు రోజులుగా అన్ని దవాఖానల్లో కొవిడ్ పరీక్షలు జోరుగా నిర్వహిస్తున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రయాణికులు, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై నిఘా పెట్టారు. కొత్తగా బుధవారం కోటగిరి మండలం పొతంగల్ వద్ద కరోనా పరీక్షల కోసం చెక్‌పోస్ట్‌ను ఏర్పాటుచేశారు. రెంజల్ మండలం కందకుర్తి వద్ద కొత్తగా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటుచేయాలన్న యోచనలో ఉన్నారు. కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణం రోగులకు వైద్యాన్ని అందించేందుకు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానలో ఐసోలేషన్ వార్డును పునరుద్ధరించారు. వార్డుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు మహారాష్ట్రతో సుమారు 150 కిలోమీటర్ల మేర సరిహద్దు ఉంది. సరిహద్దు గ్రామాల ప్రజలకు, మహారాష్ట్రలో బంధుత్వాలు ఎక్కువగా ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి మన అంగళ్లకు కూరగాయలను తెచ్చి అమ్ముతుంటారు. దీంతో అక్కడ ప్రబలుతున్న కరోనా మన సరిహద్దు గ్రామాలు, పట్టణాలకు వ్యాపించే అవకాశం ఉంది. దీంతో అక్కడి నుంచి సరిహద్దు దాటి వచ్చేవారి ఆరోగ్య పరిస్థితులపై నిఘా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యూడీఎఫ్ మ్యానిఫెస్టో: శబరిమల సంప్రదాయం పరిరక్షణకు ప్రత్యేక చట్టం

తిరువనంతపురం, మార్చి 20: కేరళలో ఏప్రిల్ 6 జరుగున్న అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష యూడీఎఫ్ కూటమి శనివారం మ్యానిఫెస్టో విడుదల చేసింది. శబరిమల సంప్రదాయం పరిరక్షణకు ప్రత్యేక చట్టం, 40-60 ఏండ్ల గృహిణులకు నెలకు రూ.2,000 పెన్షన్, తెల్లకార్డుదారులకు ఉచితంగా ఐదు కిలోల బియ్యం, పేదలకు ఐదు లక్షల ఇండ్లు వంటి హామీలు ఇచ్చింది. సంతోషం మంత్రిత్వశాఖ, రాజస్థాన్ నమూనా మాదిరిగా శాంతి, సామరస్యం విభాగం ఏర్పాటు, పెట్టుబడిదారుల రక్షణ చట్టం, బలవంతపు బంద్‌లపై నిషేధం, ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షలకు హాజరయ్యే తల్లులకు వయసులో రెండేండ్లు మినహాయింపు, కరోనా బాధితులకు ఆసుపత్రి ఖర్చులు, ఉచితంగా ఆహారం కిట్, సామాజిక భద్రత పెన్షన్ రూ.1,600 నుంచి రూ.2,500కు పెంపు వంటివి తమ మ్యానిఫెస్టోలో పొందుపరిచినట్లు యూడీఎఫ్ తెలిపింది.

గుర్తించడానికి ముందే చైనాలో వైరస్ వ్యాప్తి

కాలిఫోర్నియా పరిశోధకులు వెల్లడి

వాషింగ్టన్,మార్చి19(ఆర్ఎన్ఎ): అధికారికంగా గుర్తించడానికి ముందు రెండు నెలలపాటు కరోనా వైరస్ చైనాలో వ్యాప్తిలో ఉందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ వైరస్‌ను చైనాలోని వూహన్‌లో తొలిసారి 2019 డిసెంబరు చివరిలో గుర్తించగా, నిజానికి ఇది 2019 అక్టోబరు నుంచే వ్యాప్తిలో ఉందని తెలిపింది. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నిర్వహించిన ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్ ప్రచురించింది. మాలెక్యులార్ డేటింగ్ టూల్స్‌ను, ఎపిడమియలాజికల్ సిమ్యులేషన్స్‌ను ఉపయోగించి ఈ వైరస్ ప్రారంభమైన తేదీని నిర్ధారించినట్లు ఈ నివేదిక పేర్కొంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం, శాన్ డియాగో స్కూల్ ఆఫ్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ జోయెల్ ఓ వర్థీమ్ మాట్లాడుతూ, సార్స్-కోవ్-2ను అధికారికంగా గుర్తించడానికి ముందు అది ఎంత కాలంపాటు చైనాలో వ్యాప్తిలో ఉందో తెలుసుకోవడం కోసం అధ్యయనం నిర్వహించినట్లు తెలిపారు. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పడం కోసం మూడు ముఖ్యాంశాలను పరిశీలించామన్నారు. లాక్‌డౌన్ విధించడానికి ముందు వూహన్‌లో సార్స్-కోవ్-2 ఏవిధంగా వ్యాపించిందో సవివరంగా అర్థం చేసుకోవడం, చైనాలో ఈ వైరస్ జన్యుపరమైన వైవిధ్యాన్ని తెలుసుకోవడం, చైనాలో ప్రారంభంలో ఈ వైరస్ కేసుల నివేదికలను పరిశీలించడం - ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. వీటిని పరిశీలించిన తర్వాత సార్స్-కోవ్-2 మొదట హుబేయి ప్రావిన్స్‌లో 2019 అక్టోబరు 15 తర్వాత ప్రారంభమైందని చెప్పేందుకు ఆధారాలను గుర్తించామని తెలిపారు. సెంట్రల్ చైనాలోని హుబేయి ప్రావిన్స్‌లో ఉన్న వూహన్‌లో 2019 డిసెంబరు చివర్లో మొదటి కోవిడ్-19 కేసును అధికారికంగా గుర్తించారని చెప్పారు. జీవాణువుల మార్పు రేటు ఆధారంగా గతంలో రెండు లేదా అంతకన్నా ఎక్కువ జీవ రూపాలు వేరుపడిన సమయాన్ని తెలుసుకునే పద్ధతిని మాలెక్యులార్ క్లాక్ అంటారని ఈ అధ్యయనం కో-ఆథర్, అరిజోనా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మైఖేల్ వోరోబీ చెప్పారు. ఈ పద్ధతిని తాజా అధ్యయనంలో పరిశోధకులు ఉపయోగించినట్లు తెలిపారు. ప్రస్తుత సందర్భంలో సార్స్-కోవ్-2కు సంబంధించిన అన్ని రకాల వేరియెంట్లకు ఉమ్మడి మూలం 2019 నవంబరు 15నాటికి ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. సమీప గతంలోని ఉమ్మడి మూలానికి సంబంధించిన మాలెక్యులార్ డేటింగ్‌ను పెరుగుతున్న వ్యాధి మొదటి కేసును అధికారికంగా గుర్తించడానికి తరచూ ఉపయోగిస్తారన్నారు. ఉమ్మడి మూలానికి ముందే మొదటి కేసు ఉండే అవకాశం ఉందన్నారు. అంచనా వేసిన ఉమ్మడి మూలం కన్నా కొన్ని రోజులు, వారాలు, నెలల ముందే ఈ మహమ్మారికి సంబంధించిన వాస్తవ మొదటి కేసు ఉండి ఉండవచ్చునని చెప్పారు. ప్రధాన జీవ కణాలన్నీ కలిసి కనిపించిన కాలాన్ని నిర్ణయించడమే తమ పరిశోధన లక్ష్యమని వివరించారు. ఈ పరిశోధన ఆధారంగా చైనాలో 2019 నవంబరు 4 వరకు సార్స్-కోవ్-2 సోకినవారి సంఖ్య కనీసం ఒకటి కన్నా తక్కువే ఉండవచ్చునని తేలిందన్నారు. 13 రోజుల తర్వాత ఈ వైరస్ సోకినవారు కనీసం నలుగురు ఉండే అవకాశం ఉందని, 2019 డిసెంబరు 1నాటికి తొమ్మిది మందికి సోకి ఉండవచ్చునని అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కోవిడ్-19గా పిలుస్తున్న వ్యాధి లక్షణాలుగల ఓ వ్యక్తి వూహన్‌లో 2019 డిసెంబరు మధ్య కాలంలో ఆసుపత్రిలో చేరారు. దీనికి సంబంధించిన మొదటి కేసు ఇదే.

కాళేశ్వరంతో మారుతున్న పరిస్థితి

జలాశయాల్లోకి చేరుతున్న గోదావరి జలాలు చేపపిల్ల పెంపకానికి అనువుగా పరిస్థితులు మత్స్యకారుల్లో పెరుగుతున్న భరోసా

కరీంనగర్,మార్చి20(ఆర్ఎన్ఎ): చేపల పెంపకం ద్వారా నీలి విప్లవం సాధించడానికి అనువుగా జిల్లా మారిందని చెప్పుకోవచ్చు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చేపల పెంపకానికి ప్రోత్సాహాన్ని అందిస్తూ జిల్లాను ఎంపిక చేయడంతో మత్స్యకారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం చేయూతను అందిస్తుండడంతో ఉపాధిలో మార్పులు కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతలతో గోదావరి జలాలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరుతో పాటు చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయి. మత్స్యశాఖ సబ్సిడీపై చేపపిల్లలను చెరువుల్లో వదలడం, సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా రుణాలు, వాహనాలు అందిస్తూ వ్యాపారానికి ఊతం ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా తోడుకావడంతో మరింత ముందుకు సాగుతారని ఆర్థిక మార్పు వస్తుందని భావిస్తున్నారు. జిల్లా మత్స్య పరిశ్రమ అభివృద్ధి కోసం ఈ ఆర్థిక సంవత్సరం వర్షాకాలంలో రాష్ట్ర ప్రభుత్వం వందశాతం రాయితీతో చేపపిల్లలను సరఫరా చేసి దిగుబడిని పెంచింది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏటికి ఎదురీదుతూ నీటిపై కష్టాల జీవ నం సాగిస్తున్న మత్స్యకారుల్లో ఆర్థికాభివృద్ధిపై ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే నీలివిప్లవానికి నాంది పలుకుతూ ప్రాజెక్ట్‌లు, చెరువుల్లో చేపల పెంపకానికి శ్రీకారం చుట్టింది. ఇదే క్రమంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగును వర్గీకరించింది. దేశంలో 728 జిల్లాలను వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్థకం, కోళ్ల పరిశ్రమ, చేపలు, పాలు, ఇతర సముద్ర ఉత్పత్తులకు అనువైనవిగా వర్గీకరించింది. తెలంగాణ జిల్లాలోని 33 జిల్లాల్లో 12 పంటలపై దృష్టి సారించాలని కేంద్రం ప్రతిపాదించింది. అందులో రాజన్న సిరిసిల్ల జిల్లాను చేపల ఉత్పత్తికి అనువైనదిగా కేంద్రం గుర్తించింది. గతంలో ఎప్పుడూ నీటి ఇబ్బందులతో ఏడారిగా కనిపించే జిల్లా కాళేశ్వరం జలాలతో జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌తో పాటు ఎగువ మానేరు ప్రాజెక్ట్‌తో పాటు 402 చెరువుల్లో ఇప్పటికే చేపల ఉత్పత్తి జరుగుతుండగా తాజాగా అన్నపూర్ణ ప్రాజెక్ట్ కూడా సిద్ధమయ్యింది. జిల్లా వ్యాప్తంగా రెండు ప్రాజెక్ట్‌లు, 402 చెరువులు ఉన్నాయి. మత్స్య శాఖ పరిధిలో 90 చెరువులు, గ్రామ పంచాయతీల పరిధిలో 310 చెరువులు, శ్రీ రాజరాజేశ్వర మిడ్‌మానేరు, ఎగువ మానేరు జలాశయాలు ఉన్నాయి. వీటికి తోడు అన్నపూర్ణ అనంతగిరి ప్రాజెక్ట్ కూడా ఈ సారి అందుబాటులోకి వచ్చింది. జిల్లాలో 90 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా అందులో 5,538 మంది సభ్యులు ఉన్నారు. రెండు మహిళా సంఘాలు, ఒకటి ప్రాథమిక మత్స్య మార్కెటింగ్ సొసైటీ ఉంది. దీంతో పాటు ఔత్సాహిక రైతులకు చేపల చెరువును నిర్మించి పెంపకానికి సబ్సిడీని కూడా అందిస్తోంది. చందుర్తి మండల ఎన్గల్‌లో నీలి విప్లవంలో భాగం ముగ్గురు చేపల చెరువుకు దరఖాస్తు చేసుకోగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మత్స్య కార్మికుల కమ్యూనిటీహాళ్ళ, కిసాన్ క్రెడిట్ కార్డులనుకూడాఅందిస్తున్నారు.

గవర్నర్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు లీక్

-విచారణ జరపాలంటూ హైకోర్టులో నిమ్మగడ్డ పిటిషన్

అమరావతి,మార్చి20(ఆర్ఎన్ఎ): తాను గవర్నర్‌తో జరుపుతున్న ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నీ బయటకు లీకవుతున్న విషయంపై విచారణ జరపాలని హైకోర్టులో ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పిటిషన్ వేశారు. సీబీఐతో విచారణ జరపాలని నిమ్మగడ్డ కోరారు. తాను గవర్నర్‌కు రాస్తున్న లెటర్స్ అన్ని పబ్లిక్ కాదని, ప్రివిలేజ్ లెటర్స్ అని అవి గవర్నర్ ఆఫీస్ నుంచి ఎలా బయటకు వస్తున్నాయో విచారణ జరపాలని నిమ్మగడ్డ కోరారు. సెలవు పెడుతున్న విషయాలు కూడా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. మంత్రులు తాను గవర్నర్‌కు రాసిన లేఖలను సోషల్ మీడియాలో చూశామని చెబుతున్నారని అది ఎలా సాధ్యమో విచారించాలని నిమ్మగడ్డ కోరారు. గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, సీఎస్, మంత్రులు పెద్దిరెడ్డి, బొత్సలను ప్రతివాదులుగా చేర్చారు. నేడు దీనిపై హైకోర్టు విచారణ చేయనుంది.

ఎపిలో అండర్‌గ్రౌండ్ మాఫియా రాజ్యం

-మాజీమంత్రి యనమల ఆరోపణ

అమరావతి,మార్చి20(ఆర్ఎన్ఎ): ఏపీలో అండర్ గ్రౌండ్ మాఫియా పెరగడం ఆందోళనకరమని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రౌడీయిజాన్ని, గుండాలను అధికార వైసీపీనే పెంచి పోషిస్తోందని ఆరోపించారు. మాదక ద్రవ్యాలతో మత్తులో ముంచి యువతను పెడదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. వాటాల కోసం బెదిరించి పరిశ్రమలను తరిమేశారని, ఉపాధి అవకాశాలకు గండికొట్టారని విమర్శించారు. అక్రమ వసూళ్లు, రౌడీదందాలతో సామాన్య వ్యాపారులు బెంబేలెత్తుతున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం 24? పెరిగిందని, పేదరికం 20శాతానికి చేరిందన్నారు. మానవాభివృద్ధి సూచిలో ఏపీ 27వ స్థానానికి దిగజారిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో గిని కోఎఫిసియంట్ 34శాతంనకు చేరిందన్నారు. అన్నా క్యాంటీన్ల మూత, పండుగ కానుకల రద్దుతో పేదల జీవితాలు దుర్భరమయ్యాయని తెలిపారు. పొట్టకూటి కోసం మాఫియా ఉచ్చులో యువత చిక్కుకుంటోందని అన్నారు. అధికార వైసీపీ మాఫియా గ్యాంగులకు రక్షణ కవచంగా మారిందని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులో మునిగితేలుతున్న సీఎం జగన్ ఇకనైనా పగలు, ప్రతీకారాలకు స్

జర్మని బాబుపై చర్యలేవీ..

- ఏడాదిగా అందుబాటులో లేని ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు
- నియోజకవర్గ సమస్యలు పట్టని రమేష్
- ఎమ్మెల్యే పై నిప్పులు చెరిగిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

రాజన్న సిరిసిల్లా, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి):వేములవాడలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు అందుబాటులో లేకపోవడంతో ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీ నిప్పులు

చెరిగుతుంది. ఎమ్మెల్యే నివాసం ఉంటున్న సేవ్స్ గెస్ట్ హౌస్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. శనివారం రోజున కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ వేములవాడ లోని ఆది శ్రీనివాస్ గృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గానికి ఏడాది కాలంగా దూరంగా ఉన్న ఎమ్మెల్యే రమేష్ బాబు పై సీఎం కేసీఆర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. సర్పంచ్ లు, కౌన్సిలర్లు పని చేయకపోతే సస్పెండ్ చేస్తున్నారు అదే ఒక ఎమ్మెల్యే పై చర్యలు ఉండవా అని సూటిగా ప్రశ్నించారు. జర్మనీ నుండి రమేష్ బాబు ఇండియా కి వస్తే రెండు పాస్ పోర్ట్ లు ఉన్నాయని లుకౌట్ నోటీస్ ఇచ్చి అరెస్ట్ చేస్తారని భయంతోనే రావడం లేదన్నారు. నెలకి లక్షల జీతం తీసుకుంటూ ప్రజలను సేవ చేయకుండా జర్మనీకి అంకితం అయిన ఎమ్మెల్యే రమేష్ బాబు శాశన సభలోనే ఎమ్మెల్యే రమేష్ బాబు పై చర్చించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వేములవాడ ఎన్నికల సమయంలో వచ్చినప్పుడు చెన్నమనేని రమేష్ బాబు ఆలయం ముందు కుర్చీసుకుని అభివృద్ధి చేస్తాడని ప్రజలను నమ్మబలికించి తీరా కరోనా లాక్ డౌన్ కంటే ముందుగా జర్మనీ కి వెళ్ళిపోయిన ఎమ్మెల్యే ఇప్పటివరకు నియోజకవర్గానికి రాకుండా అక్కడి నుండే అధికారులతో విడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆన్ లైన్ పాలనా చేస్తున్న రమేష్ బాబు పై కేసీఆర్ తక్షణమే రాజీనామా చేయించి బై ఎలక్షన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 23 తేదీ లోపు ఇండియా కి రాకపోతే కాంగ్రెస్ పార్టీ తరుపున చలో అసెంబ్లీకి పిలుపునిస్తామన్నారు. సిరిసిల్ల ఎగువ మానేరు ఎప్పుడో పూర్తి చేస్తా అన్న కేటిఆర్, కానీ నేటి వరకు అలాగే ఉందని ఎద్దేవా చేశారు.

అర్ధరాత్రి కాంగ్రెస్ నేతలను సంసారాలు చేయకుండా రాత్రికి రాత్రే పోలీసులు అరెస్ట్ చేయడం శోచనీయమన్నారు. 23 తేదీన ఎమ్మెల్యే రమేష్ బాబు ఇండియా కు రాకుంటే 24 తేదీన అసెంబ్లీనీ లోక్ సభ నియోజకవర్గ నుండి కాంగ్రెస్ నేతలం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నేతలు, రమేష్ బాబు గెస్ట్హౌస్ ను ముట్టడి చేయరని కనీసం మూత్రం పోయాడానికి కూడా వెళ్ళరని నిప్పులు చెరిగారు. 24 తేదీన కాంగ్రెస్ నేతలు అసెంబ్లీ ముట్టడికి పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఆది శ్రీనివాస్ తో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ గౌడ్, జెడ్పీ టీ సీ నాగం కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, మండల అర్బన్ అధ్యక్షుడు పిల్లి కనకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, షేక్ ఫిరోజ్ పాష ఎంపీటీసీలు రంగు వెంకటేష్ గౌడ్, చెన్నోజి శ్యామల గోవర్ధన్ రెడ్డి, బొడ్డు శంకరమ్మ రాములు, సర్పంచులు సోమినేని కరుణాకర్, కదిరే రాజ్ కుమార్, పండుగ ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు సంఘ స్వామి యాదవ్, కూరగాయల కొమురయ్య, సగ్గు పద్మా, ఎర్ర ఆగయ్య, తూమ్ సంతోష్, కనికరపు రాకేష్, కోలకాని రాజు, ఎర్ర శ్రావణ్, ఖమ్మం గణేష్, తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోన్న వైసిపి: ఎమ్మెల్యే

రాజమండ్రి,మార్చి20(ఆర్ఎన్ఎ): ఎన్నికల్లో వైసీపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి గెలుస్తుందని తెలుగుదేశం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ వ్యాఖ్యానించారు. శనివారం ఆదిరెడ్డి భవానీ మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలపై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రిలో కార్యకర్తలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగోసారి టీడీపీని గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాజమండ్రి మేయర్ స్థానాన్ని గెలిపించి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకి కానుకగా ఇద్దామని ఆదిరెడ్డి భవాని పేర్కొన్నారు.

భారీగా ఎర్రచందనం పట్టివేత

స్మగ్లింగ్ వాహనాలను ఛేజ్ పట్టుకున్న పోలీసులు

చిత్తూరు,మార్చి20(ఆర్ఎన్ఎ): భారీ ఎత్తున ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని.. నలుగురు ఎర్ర చందనం స్మగ్లర్లను చిత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2 కోట్ల విలువైన 5.2 టన్నుల 182 ఎర్ర చందనం దుంగలు, ఒక లారీ, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరుకు సమీపంలోని పెనుమూరు క్రాస్ వద్ద వాహనాలను తనిఖీలో ఎర్రచందనం స్మగ్లర్లు పట్టుబడ్డారు. తిరుపతి వైపు నుంచి చిత్తూరు వైపు వస్తున్న స్మగ్లింగ్ వాహనాలు పోలీసుల పైకి దూసుకెళ్లాయి. ఆ ప్రమాదం నుంచి తప్పించుకున్న పోలీసులు.. పారిపోతున్న వాహనాలను వెంటాడి మరీ పట్టుకున్నారు. కడప జిల్లాకు చెందిన శివయ్య, నెల్లూరు జిల్లాకు చెందిన క్రిష్ణయ్య, తిరుపతికి చెందిన ఎ.కిరణ్, తమిళనాడు వెల్లూరుకు చెందిన వి.బాలాజీలను అరెస్ట్ చేశారు.

మానవ మనుగడకే ఆధారాలు సువిశాల అడవులు

21 మార్చి 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం' సందర్భంగా)

అడవులు, హరితవనాల వనరులు భూతవర్తమానభవిష్యత్ తరాల సంపూర్ణ ఆరోగ్యానికి, వాతావరణ సానుకూల మార్పులకు, జీవవైవిధ్య పరిరక్షణకు మరియు ప్రపంచ సుస్థిరాభివృద్ధికి ఉపయోగపడుతున్నాయి. ఐరాస చేపట్టిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలైన పేదరిక నిర్మూలన, వాతావరణ సమతుల్యత, ఆర్థిక ప్రగతి, సామాజిక వికాసం, ఆరోగ్య ప్రయోజనాలు వంటి అంశాల సాధనకు అడవులు ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. అడవుల నరికివేత, హరిత సంపద తరుగుదల వల్ల విశ్వ మానవాళి ఉనికే ప్రమాదం పడనుంది. భూమాతకు ఊపిరితిత్తులుగా మరియు కర్బన షోషణ (కార్బన్ సింక్‌లు) కేంద్రాలుగా అడవులు సకల జీవకోటికి ఎనలేని సేవలను అందిస్తున్నాయి. అడవుల పరిరక్షణ పట్ల సామాన్యులకు అవగాహన కల్పించే ప్రయత్నాలలో భాగంగా ప్రతి ఏటా 21 మార్చి రోజున ఐరాసలోని 'ఆహారం మరియు వ్యవసాయ సంస్థ (ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్)' విభాగం నేతృత్వంలో 2013 నుంచి 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది అంతర్జాతీయ అడవుల పరిరక్షణ దినం-2021 వేడుకలకు 'అడవుల పురరుద్ధరణ : తిరిగి భర్తీ శ్రేయస్సు కోసం' అనే అంశాన్ని నినాదంగా తీసుకున్నారు. ఐరాస తీర్మానం ప్రకారం 2021 - 2030 దశాబ్దాన్ని 'ఐరాస పర్యావరణ లేదా జీవావరణ వ్యవస్థ పునరుద్ధరణ దశాబ్దం'గా కూడా ప్రకటించడం జరిగింది. ఐరాస చొరవతో 2011 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ అడవుల పరిరక్షణ సంవత్సరం'గా పాటించడం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా 1.6 బిలియన్ల గిరిజన ప్రజలు ప్రత్యక్షంగా ఆహారం, గృహాలు, శక్తి, ఔషధాలు మరియు ఆదాయ వనరుల కోసం అడవులపై ఆధారపడి ఉన్నారు. ప్రపంచ అడవుల వల్ల 80 శాతం భూసంబంధ జీవవైవిధ్యం ఫలిస్తున్నది. విశ్వవ్యాప్తంగా ప్రతి ఏటా 13 మిలియన్ హెక్టార్ల (32 మిలియన్ ఎకరాలు) అడవులను నరికి వేయడం, దాదాపు 20 శాతం వరకు హరితగృహ వాయు ఉద్గారాలు వెలువడుతున్నాయి. అడవులతో మానవాళికి గృహ కలప, పేపర్, ఫర్నీచర్, ఔషధాలు, జిగురు, వంట చెరుకు, ఆహారం, పూలు, కాయలు, ఫలాలు, శుద్ధ జలం, పశు గ్రాసం, పీచు పదార్థాలు, నూనెలు లాంటి ప్రత్యక్ష ప్రయోజనాలు కలుగుతాయి. వానలు కురవడం, భూతాపం తగ్గడం, హరిత గృహ వాయువులను పీల్చడం, జీవవైవిధ్య పరిరక్షణ, జీవులకు ఆవాసాలు, నీడలు, నేల నాణ్యత పెరగడం, నేల కోత మరియు వారదలను అరికట్టడడం, వాతావరణ సానుకూల మార్పులు రావడం, ఆక్సీజన్‌ను వదిలి కార్బన్ డై ఆక్సైడ్‌ను శోషణం చేసుకోవడం, శీతల వాతావరణ కల్పన లాంటి పరోక్షం ప్రయోజనాలు కూడా కలుగుతాయి. భూగోళంపై ఉన్న నేలలో కనీసం 30 శాతం అడవులు ఆక్రమించి ఉండాలి. ప్రతి ఏటా 2 బిలియన్ టన్నుల కార్బన్‌ను తోలగించవలసిన బృహత్ కార్యం అడవులు నిర్వహించాలి. అడవులు నరికి వేసిన ఫలితంగా కరువు తాండవం చేస్తున్నది. పోడు వ్యవసాయం కోసం నిరంతరం అడవుల నరికివేత జరుగుతోంది. ప్రభుత్వ మరియు పౌరుల ప్రమేయంతో నేడు దాదాపు 50 శాతం అడవుల నరికివేత తగ్గడం గమనించారు. అడవుల విస్తీర్ణం తగ్గిన ఫలితంగా ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు లాంటి క్రూరమృగాలు జనావాసాల్లోకి రావడం, ప్రజల మరియు పశువుల/మేకల/గొర్రెల ప్రాణాలు తీయడం మరియు జూనోటిక్ వ్యాధులు సంక్రమించడం జరుగుతోంది.

అడవుల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యల్లో భాగంగా ప్రణాళికాబద్ధంగా అడవుల నరికివేత, నరికిన చోట తిరిగి వనాలు పెంచడం, అడవులు కాలిపోవడాన్ని కట్టడి చేయడం, అడవులను పెంచడం, మానవ ఆవాసాలలో చెట్లు పెంచడం, ఇంటింటా హరిత తివాచీలు పరచడం, పోడు వ్యవసాయాన్ని నిషేధించడం, అడవుల రక్షణ, అక్రమ కలప/గంధం రవాణాను కట్టడి చేయడం, ప్రతి ఏటా పెద్ద ఎత్తున మె?క్కలు నాటడం, వన్యప్రాణులను రక్షించుకోవడం, అటవీ ఉత్పత్తులతో ఆదాయం పెంచుకోవడం, అడవులను పర్యాటక స్థలాలుగా మార్చడం, కలప ఫర్నీచర్ వాడకం తగ్గించడం, పేపర్ వాడకాన్ని తగ్గించడం, ఒక చెట్టును నరికే ముందు 10 మె?క్కలు నాటి పరిరక్షించడం లాంటివి వస్తాయి. మనిషి లేకుండా అడవులు మనగలుగుతాయి, కాని అడవులు లేకుండా మనిషి మనుగడ అసాధ్యమని మనందరికీ తెలుసు. అడవులను, హరిత తివాచీలను పరిరక్షించుకుందాం, పచ్చని సంసారాలను ప్రేమగా నిర్మించుకుందాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

జిల్లాలో కరోనా వైరస్ ఉధృతి

అప్రమత్తం అయిన వైద్యారోగ్య శాఖ

మంచిర్యాల,మార్చి20(ఆర్ఎన్ఎ): జిల్లాలో కరోనా వైరస్ ఉధృతి కొనసాగుతోంది. కొన్నిరోజులుగా గణనీయంగా పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర అందోళనకు గురవుతున్నారు. ఊహించని విధంగా కరోనా పంజా విసురుతుండటంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. పాజిటివ్ కేసుల సంఖ్య క్రమేపీ పెరుగుతుండటంతో అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రోజువారీ టెస్టుల సంఖ్యను గణనీయంగా పెంచుతున్నారు. జిల్లా ఆసుపత్రి తోపాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్లస్టర్ హెల్త్ సెంటర్లు, అర్బన్ పీహెచ్‌సీలతోపాటు ఆర్బీఎస్కే టీంలు, మొబైల్ టీంలు వైరస్ లక్షణాలుగల వారికి కొవిడ్-19 పరీక్షలు నిర్వహిస్తున్నాయి. కొవిడ్ కేసులు పెరుగుతున్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అన్ని పాఠశాల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలా గే ప్రతి రోజు ఉదయం విద్యార్థులకు టెంపరేచర్ పరీక్షలు నిర్వహించా లని దగ్గు, జలుబు ఉంటే వెంటనే ఇళ్లకి పంపించాలని సూచించారు. తరగతి గదిలో 6 ఫీట్లు దూరం ఉండాలని, బెంచ్‌కు ఒకరే కూర్చేనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం వండేవాళ్లు విధిగా మాస్కులు ధరించాలని, టాయిలెట్లు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచాలన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మరో 35 మందికి కరోనా సోకింది. 12 మంది టీచర్లు, ఇద్దరు వంట మనుషులు, ఒక విద్యార్థినికి కరో నా సోకిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రధానోపాధ్యాయురాలు శారద కోరిక మేరకు పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థినులు, వారి తల్లి దండ్రులకు పరీక్షలు నిర్వహించారు. బాధితుల్లో 10వ తరగతి విద్యార్థినులు 20 మంది, 9వ తరగతికి చెందిన వారు 8, ఎనిమిదవ తరగతికి చెందిన ఒక విద్యార్థిని ఉన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆరుగురు సైతం వైరస్ భారిన పడ్డా రు. వైరస్ బారిన పడ్డ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అధికారులు హోం క్వారంటైన్‌కు తరలించారు. రెండు రోజుల్లో పాఠశాలకు చెందిన మొత్తం 50 మంది కరోనా భారిన పడ్డారు. కాగా వైరస్ భారిన పడ్డవారిలో ఎలాంటి లక్షణాలు లేవని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థినులకు కరోనా సోకడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు పాఠశాలను మూసి వేస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు పాఠ ల ఆవరణలో శానిటైజేషన్ పనులు చేపట్టిన అనంతరం మళ్లీ ప్రారంభిస్తామన్నారు. వ్యాధి గ్రస్తులు మినహా మిగతా ఉపాధ్యాయులు, విద్యార్థినులు హాజరు కావాలని కోరారు. జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గ్రామస్థాయి అధికారులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వైరస్ బారినపడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని సూచించారు. తరచూ శానిటైజేషన్ చేస్తూ ఉండాలన్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడు కూడా అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. ప్రజలు గుంపులుగుంపులుగా ఒకే ప్రాంతంలో ఉండకూడదని, కరోనా నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అరెస్టులు పిరికిపంద చర్య

వేములవాడ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి

రాజన్న సిరిసిల్లా, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి): ఏడాదికాలం గా అందుబాటులో లేకుండా పోయిన ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు అక్రమంగా అరెస్ట్ చేయడం పిరికిపంద చర్యగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సాగరం వెంకటస్వామిప్రభుత్వాన్ని అభివర్ణించారు.అక్రమ అరెస్టులకు నిరసనగా శనివారం వేములవాడ పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాగరం వెంకటస్వామి మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏడాదిపాటు స్థానికంగా ప్రజలకు అందుబాటులో లేకపోవడం సిగ్గుచేటని అన్నారు .సంవత్సరం పాటు ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే రమేష్ బాబు రాజీనామా చేయాలని ప్రభుత్వ పనులన్నీ కుంటుపడుతున్నాయన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగుల విష్ణు ప్రసాద్,చిలుక రమేష్, కూరగాయల కొమురయ్య, కుదిరే రాజు, నాగుల రాము తదితరులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ విద్యా పథకం అద్భుతం : మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, మార్చి20: పేద విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఓవర్సీస్ విద్యా పథకం అద్భుతమని సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. శనివారం అసెంబ్లీలో ఓవర్సీస్ విద్యా పథకంపై పలువురు గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సవివరంగా సమాధానమిచ్చారు.

'విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే యువతకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.20 లక్షలు అందజేస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న పథకాల్లో ఇదో గొప్ప పథకం. ఇలాంటి అద్భుత పథకాలు తెలంగాణలో మినహా దేశంలో మరెక్కడా అమలు కావడం లేదు. ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 3,676 మంది విద్యార్థులకు ఈ పథకం కింద చేయూతనిచ్చాం. ఇందుకు ప్రభుత్వం రూ. 589 కోట్ల 69 లక్షలు వెచ్చించింది. లబ్ధిదారుల్లో అమెరికాలో 54%, ఆస్ట్రేలియాలో 21%, ఇంగ్లాండ్ లో 11.5%, కెనడా, సింగపూర్,జర్మనీ, న్యూజిలాండ్, జపాన్, ఫ్రాన్స్, దక్షిణ కొరియా తదితర దేశాల్లో చదువుతున్నారు' అని మంత్రి తెలిపారు.కుటుంబంలో ఎంబీబీఎస్ చదివే ఒక్కరికి మాత్రమే ఈ పథకాన్ని పరిమితం చేయగా.. మరొకరికి కూడా వర్తింపజేయాలన్న సభ్యుల విజ్ఞప్తిని ప్రభుత్వం తప్పక పరిశీలిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం బోధన్ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ మాట్లాడుతూ.. ఓవర్సీస్ విద్యా పథకం గొప్ప పథకమని కొనియాడారు. ఈ పథకం స్ఫూర్తితోనే మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో ఇదే తరహా పథకం ప్రవేశపెడతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

రామప్ప,వేయి స్తంభాలను పరిరక్షించండి

పునరుద్ధరణ కార్యక్రమాలు పూర్తి చేయండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్‌కు ఎమ్మెల్సీ లేఖ

వరంగల్,మార్చి20(ఆర్ఎన్ఎ): కాకతీయుల కాలంలో కళలకు కాణాచిగా ప్రసిద్ధి గాంచిన చారిత్రక ఆలయాలు వెయ్యి స్తంభాల గుడి, రామప్ప దేవాలయాల్లో చేపట్టిన సమగ్ర అభివృద్ధి, పునరుద్ధరణ పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ కి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి లేఖ రాశారు. కాకతీయులు తమ అప్పటి రాజధాని, ఇప్పటి వరంగల్ జిల్లా కేంద్రం వరంగల్ నడిబొడ్డున వెయ్యి స్తంభాల గుడి కట్టించారన్నారు. స్వర్ణయుగంగా పేరుగాంచిన కాకతీయులు అత్యంత ఉత్తమంగా నిర్మించిన దేవాలయాల్లో ఒకటిగా ప?రసిద్ధి పొందింది. ఈ ఆలయంలోని నక్షత్రం ఆకారంలో వాస్తుశిల్పం అద్భుతమైన హస్త కళాకారుల నైపుణ్యానికి సాక్ష్యంగా నిలుస్తున్నది. ఆలయానికి చెక్కిన రాతి స్తంభాలు ఆనాటి కళా వైభవాన్ని నేటికీ చాటుతూ ఉన్నాయని ఆ లేఖలో తెలిపారు. చారిత్రక ఆధారాల ప్రకారం, కాకతీయ రాజు రుద్రదేవుడు ఆదేశాల మేరకు క్రీ.శ 1175?1324 మధ్య వెయ్యి స్తంభాల ఆలయం నిర్మించబడింది. కళాఖండంగా ఉన్న ఈ ఆలోయాన్ని విష్ణు, శివుడు, సూర్య హిందూ దేవతలకు అంకితం చేయబడిన దిగా చెబుతారు. శాండ్ బాక్స్ పద్ధతిని ఉపయోగించి 1000 స్తంభాల ఆలయ పునాదులు వేశారు. ఈ కళా వైశిష్ట్యం కాకతీయ యుగపు శిల్ప చాతుర్యానికి మచ్చుతునక అన్నారు. 800 సంవత్సరాలకు పైగా ఆలయం చెక్కుచెదరకుండా ఉన్నప్పటికీ, ఒకటి రెండు స్తంభాలు ఒరిగాయన్న కారణంగా, ఆలయానికి దక్షిణాన ఉన్న 'నాట్య మండపం' పునర్నిర్మాణం కోసం 2005 లో భారత పురావస్తు శాఖ దేవాలయ స్తంభాలను తొలగించివేసింది. అయితే, పునరుద్ధరణ పనులు నిరుత్సాహంగా నెమ్మదిగా జరుగుతున్నాయి. ఇది 18 నెలల్లోపు పూర్తి చేయాలని అనుకున్నారు. కాని ఒక దశాబ్దం గడిచినా ఇంకా పూర్తి కాలేదు. దీన్ని వెంటనే పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు

కాంగ్రెస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

రాజన్న సిరిసిల్లా, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ ఏడాది కాలంగా నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం శోచనీయమని చందుర్తి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు, శనివారం జడ్పిటిసి నాగం కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజల ఓట్లతో గెలుపొందిన వేములవాడ ఎమ్మెల్యే రమేష్ బాబు సంవత్సరకాలం పాటు నియో జకవర్గంలో అందుబాటులో లేకపోవడం, జర్మనీ దేశంలో విలాసవంతమైన జీవితాన్ని గడపడం ఎంతవరకు సమంజసమన్నారు, ఎమ్మెల్యే ఆచూకీ తెలపాలంటూ అసెంబ్లీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ నాయకులను ప్రభుత్వ ఒత్తిడితో పోలీసులు అరెస్టు చేయడం ఎంతవరకు సమంజస మన్నారు, ఇప్పటికైనా అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమ ంలో జోగాపూర్ ఎంపిటిసి మ్యాకల గణేష్, నాయకులు పులి సత్యం గౌడ్, ప్రభాకర్, బోజ్జా మల్లేశం, భీమరాజు కనకరాజు, సంటి ప్రసాద్, దేవ స్వామి, దారం చంద్రం తదితరులుపాల్గొన్నారు,

సూర్యాపేటలో మిద్దె తోటల పెంపకం భేష్ : మంత్రి నిరంజన్ రెడ్డి

సూర్యాపేట, మార్చి 20 : కూరగాయల పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెల్లడించారు. మిద్దె తోటల పెంపకం వైపు ప్రజలు మొగ్గు చూపుతుండటం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు. కూరగాయల పంట సాగుపై శనివారం శాసనమండలిలో జరిగిన చర్చలో మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో మిద్దెల తోటల పెంపకం పెరిగిందని వెల్లడించారు. ఇందుకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అందించిన ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. సూర్యాపేటలో 1500 మందికి పైగా మిద్దెల తోటలు సాగు చేస్తున్నారని మంత్రి నిరంజన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 143 పట్టణ ప్రాంతాల్లో 13 కార్పొరేషన్ల పరిధిలో కూరగాయల సాగుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తున్నది చెప్పారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు పట్ల ఆలయ రెనొవేషన్ కమిటి హర్షం

రాజన్న సిరిసిల్లా, మార్చి 20 (నేటినిజం ప్రతినిధి): ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడను సర్వాంగ సుందరంగా తీర్చిధిద్దేందుకు,నిన్నటి రాష్ట్ర బడ్జెట్ లో 50 కోట్లుకేటాయించినందుకు సీఎం కె??సిఆర్ , మంత్రి కె?టిఆర్ ,ఎమ్మెల్యే రమేష్ బాబు రాజన్న ఆలయ రెనొవెశన్ కమికిసభ్యులు నామాల లక్ష్మీరాజ్యం, రాపెల్లి లావణ్య శ్రీధర్ , పు?లాస నరేందర్, పిట్టలవెంకటేశం, వెంకటేష్ కుమార్ ,రమేష్ భాస్కర్ , రవి ,రమణారెడ్డి, రాజు, ఆనందం, జీవన్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు.కొంత కాలం నుండి ఆలయం అభివృద్ధిలో భాగంగా ఆలయ విస్తరణ పనులు,బ్రిడ్జిల నిర్మాణం,ఆనువత్రి నిర్మాణం,బై పాస్ రోడ్ల నిర్మాణం,సెంట్రల్ లైటింగ్ తొ సుందరీకరన వంటిపలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ,అలాగే అంతేకాకుండా బద్దిపొచమ్మ ఆలయంఅభివృద్ధిపరుచుటకు,గుడి చెరువును ఆహ్లాదకరమూగా మార్చుటకు,సుందరీకరన పనులు జరుగుటకు,ప్రధాన రహదారిని విస్తరించేందుకు తగిన ప్రతిపాదనలను మంత్రివర్యులు కె?టిఆర్, దీనిపై ఎమ్మెల్యే రమేశ్ బాబు ల చొరవ,కృషి తొ ప్రణాళికలను రూపొందించారు.

ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల భక్తులు లతో పాటు,వేములవాడ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు .

స్వరూపానందేంద్ర స్వామిని కలిసిన టీటీడీ ఈఓ జవహర్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 20: విశాఖ శ్రీశారదా పీఠాధిపతి శ్రీస్వరూపానందేంద్ర స్వామిని తిరుమల తిరుపతి దేవస్థానం ఈఓ జవహర్ రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీటీడీకి సంబంధించిన పలు విషయాలను స్వామివారితో ఆయన చర్చించారు. పలు కీలక అంశాలను జవహర్ రెడ్డి స్వామివారి దృష్టికి తీసుకువెళ్లారు.

ఈ సందర్భం